VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A, New Zealand)
QUALITY SERVICE SINCE 1997
AAERI
QEAC No. E334
: 1-10-3, Ashok Nagar, Hyderabad-20. INDIA
: 91(40) 27628194, 27674037
: victoria.ashoknagar@gmail.com
: //www.victoriaoverseas.com

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 120, పేజీలు - 08
సోమవారం, అక్టోబర్ 6, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

- Host On Your Domain
- Hosting / Admin Panel
- Page Builder / Social Links
- Responsive Design
- Advertisement Spaces
- Search Engine Optimization
- XML Sitemap
- Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

# రేవంత్ 'ఫ్యూచర్' నెరవేరుతుందా.?

## - న్యూయార్క్ లాంటి మెగా సిటీ మారాలన్నది సీఎం లక్ష్యం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆశయాల్లో ప్రధానమైనది 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్. హైదరాబాద్ ఆర్థిక వృద్ధికి ఈ మెగా అర్బన్ డెవలప్‌మెంట్ ప్రణాళిక డ్రైవర్‌గా మారనుంది. 2025 సెప్టెంబర్ 28న శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ గ్లోబల్ స్టాండర్డ్స్‌తో నిర్మాణం చేస్తామని సీఎం ప్రకటించారు. అయితే, కేంద్ర సహకారం, ఆంధ్రప్రదేశ్‌తో అంతర్జాల సమస్యలు దీని మార్గాన్ని కష్టతరం చేస్తున్నాయి.

**- గ్లోబల్ హబ్‌గా తెలంగాణ..**

సీఎం రేవంత్ రెడ్డి ప్రకారం, ఫ్యూచర్ సిటీ 15 వేల ఎకరాల్లో (765 చ.కి.మీ.) విస్తరించి, ఏఐ సిటీ, హెల్త్ జోన్, ఎడ్యుకేషన్ జోన్ వంటి తొమ్మిది రంగాలను కలిగి ఉంటుంది. మొదటి దశలో 30 వేల ఎకరాల్లో నిర్మాణం ప్రారంభమై, ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఆకర్షించాలనే లక్ష్యం. పదేళ్లలో న్యూయార్క్ లాంటి మెగా సిటీగా మారాలని సీఎం లక్ష్యం. ఇది తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఎకానమీ (2034) నుంచి 3 ట్రిలియన్ డాలర్ల (2047) వరకు ఊరట చేస్తుందని 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో పేర్కొన్నారు. వరల్డ్ బ్యాంక్, జేఐసీఏ వంటి అంతర్జాతీయ సంస్థల సహకారంతో, లక్షలాది ఉద్యోగాలు, ఇన్నోవేషన్ హబ్‌గా ఎదగాలని ప్రణాళిక. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) 2025 మార్చి 12న ఏర్పడి, సింగిల్ - విండో క్లియరెన్స్‌లతో ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది. ఇది ఆంధ్ర రాజధాని అమరావతి, చంద్రబాబు నాయుడు సృష్టించిన సైబరాబాద్, కేసీఆర్ కట్టించిన సచివాలయాన్ని మించి, రేవంత్ లెగసీగా నిలవాలని భావిస్తున్నారు.

**- ఆటంకాలు..**

కేంద్రం, రాష్ట్రాల మధ్య రాజకీయ ఆడంబరాలు ప్రాజెక్ట్ సాకారకాంగా మారడానికి అడ్డంకులు ఎక్కువ. కాంగ్రెస్ పాలిత తెలంగాణకు కేంద్రం(బీజేపీ) నిధులు, ఆమోదాలు పరిమితంగా ఇస్తోంది. రెండేళ్ల పాలనా కాలంలో, కేంద్ర ఆమోదం లేకుండా ప్రాజెక్ట్ ముందుకు సాగడం కష్టం. మరోవైపు, ఫ్యూచర్ సిటీ హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ, దాని కనెక్టివిటీ ఆంధ్రప్రదేశ్‌పై ఆధారపడి ఉంది. ముఖ్యంగా, రతన్ టాటా గ్రీన్‌ఫీల్డ్ హైవే (41 కి.మీ., రూ. 4,621 కోట్లు) 14 గ్రామాల

2లో..

# బీహార్ నుంచే అన్నీ మొదలు

## - సీఈసీ కీలక ప్రకటన




**పాట్నా (ప్రశ్న న్యూస్)** ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనబోతోంది.. బీహార్. నవంబర్/డిసెంబర్ లో పోలింగ్ జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన కసరత్తును కొనసాగిస్తోంది కేంద్ర ఎన్నికల సంఘం. ఇప్పటికే ఓటర్ల తుది జాబితాను కూడా విడుదల చేసింది. ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో అధికారంలో ఉన్న జనతాదళ్ (యునైటెడ్)- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం ఓటర్లపై వరాల జల్లు కురిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో అక్కడి ఏర్పాట్లను పూర్తి చేస్తోంది కేంద్ర ఎన్నికల కమిషన్. ఈ ఎన్నికల్లో ఈవీఎం బ్యాలెట్‌పై అభ్యర్థుల ఫొటోలు రంగుల్లో కనిపించనున్నాయి. ఈ మార్పును అమలు చేయనున్న మొదటి రాష్ట్రంగా బిహార్ నిలవబోతోంది. ఈ విషయాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం ఆయన బీహార్ లో పర్యటిస్తోన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా పాట్నాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రస్తుతం ఈవీఎం బ్యాలెట్లపై అభ్యర్థుల ఫొటోలు బ్లాక్ అండ్ వైట్ లో ఉండటం వల్ల వారిని గుర్తించడం ఓటర్లకు కష్టతరమౌతోందని, ఎన్నికల చిహ్నాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, ఫొటోల విషయంలో ఈ సమస్య ఎదురవుతోందని అన్నారు. సీరియల్ నంబర్ కూడా పెద్దదిగా ఉండాలని సూచనలు వచ్చాయని, వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మార్పులు చేస్తోన్నామని

2లో..

# జగన్ నేర్పిన గుణపాఠం

## - ముందే మేల్కొన్న సీఎం చంద్రబాబు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో అభివృద్ధితో పాటు సంక్షేమం సమాంతరంగా నడుస్తోంది. అదే సమయంలో అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరోవైపు పోలవరం ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. ఐటీ సంస్థలతో పాటు పరిశ్రమలు తరలివస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజల్లో సంతృప్తి కనిపిస్తోంది. ఇటువంటి క్రమంలో కొంతమంది కూటమి ఎమ్మెల్యేల పనితీరు పుణ్యమా అని ఈ ప్లస్ మైనస్ గా మారుతోంది. అందుకే సీఎం చంద్రబాబు సీరియస్ గా ఉన్నారు. రాజకీయంగా కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధపడుతున్నారు. అవసరం అనుకుంటే కొంతమందిని వదులుకునేందుకు కూడా ఆయన వెనుకడుగు వేసే చాన్స్ కనిపించడం లేదు. ముందుగా ఆయా జిల్లాల ఇన్చార్జ్ మంత్రులు హెచ్చరిస్తారు. వినకపోతే చంద్రబాబు సీరియస్ యాక్షన్ లోకి దిగుతారు. ప్రభుత్వం పై సానుకూలత కనిపిస్తున్న తరుణంలోనే చంద్రబాబు ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**- అప్పట్లో పథకాలు ప్రారంభించినా..**

2019లో అధికారంలోకి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. ఆ ఎన్నికలకు ముందు నవరత్నాలను ప్రకటించారు. అధికారంలోకి వచ్చింది మొదలు సంక్షేమ పథకాలను అమలు చేయడం ప్రారంభించారు. అవి ప్రజల్లోకి బలంగా వెళ్లాయి.

2లో..

# బస్సు చార్జీల పెంపు దారుణం

## - రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

- సిటీ బస్సు చార్జీల పెంపుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- ఒక్కసారే రూ.10 పెంచడం దుర్మార్గమైన నిర్ణయమన్న కేటీఆర్
- హైదరాబాద్ ప్రజలపై సీఎం కక్షగట్టారని విమర్శ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో సిటీ బస్సు కనీస ఛార్జీని ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా రూ.10 పెంచాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారు. పండుగ సమయంలో తీసుకున్న దుర్మార్గమైన నిర్ణయంగా అభివర్ణించారు.

2లో..

# నా రాజీనామా వార్తలు అవాస్తవం

## - దానం నాగేందర్ క్లారిటీ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తన పదవికి రాజీనామా చేస్తున్నానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్ తీవ్రంగా స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అదంతా కేవలం దుష్ప్రచారం మాత్రమేనని ఆయన కొట్టిపారేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడి పూర్తి స్పష్టతనిచ్చారు. తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదని, ఈ పుకార్లను ఎవరూ నమ్మవద్దని దానం నాగేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

2లో..

# ప్రజల ఆరోగ్యంతో చెలగాటం న్యాయమేనా.?

- టీడీపీ పాలనలో కల్తీ మద్యం ఏరులై పారుతోందన్న జగన్
- అన్నమయ్య జిల్లా ఘటనతో టీడీపీ నేతల దందా బట్టబయలైందని వ్యాఖ్యలు
- ప్రభుత్వ మద్యం దుకాణాలు తీసేసి సిండికేట్లకు అప్పగించారని ఆరోపణ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో అధికార టీడీపీ నేతృత్వంలో వ్యవస్థీకృతంగా నకిలీ మద్యం దందా జరుగుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మద్యం సిండికేట్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారి, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని, ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో టీడీపీ నేతలు నిర్వహిస్తున్న కల్తీ మద్యం తయారీ ఫ్యాక్టరీ పట్టుబడటమే రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలకు నిదర్శనమని జగన్ పేర్కొన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను ఒక వ్యూహం ప్రకారం రద్దు చేసి, ఆ స్థానంలో టీడీపీ నేతల సిండికేట్లకు అప్పగించారని ఆరోపించారు. "మద్యం దుకాణాలు, బెల్టు షాపులు, అక్రమ పర్మిట్ రూమ్‌లు అన్నీ టీడీపీ నేతలవే. వారే నకిలీ మద్యం తయారు చేసి, వారి దుకాణాల ద్వారా అమ్మి, అక్రమ సంపాదనను పంచుకుంటున్నారు" అని జగన్ విమర్శించారు. మద్యం అమ్మకాలపై

2లో..

### కేసుల్లో కూరుకుపోతున్న
# విజయ్

## - ప్రచార రథం సీజ్ చేసిన పోలీసులు



**చెన్నై (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కరూర్ తొక్కిసలాట ఘటనలో భారీగా అరెస్టులు చోటు చేసుకుంటోన్నాయి. ఈ ఘటనకు సంబంధించి యూట్యూబర్ కమ్ జర్నలిస్ట్ ఫెలిక్స్ గెరాల్డ్‌ను చెన్నై సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై ఆయన చిత్రీకరించిన ప్రచురించిన వీడియోల నిమిత్తం విచారణ కోసం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తొక్కిసలాట ఘటనకు సంబంధించి నకిలీ వార్తలను ప్రచారం చేశారనే

2లో..

### జూబ్లీహిల్స్ రేసులో
# నలుగురు అభ్యర్థులు

## - కాంగ్రెస్ టికెట్ దక్కేదెవరికి.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో ఉపఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ముఖ్యంగా ప్రతిష్ఠాత్మకమైన జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఈ స్థానానికి అభ్యర్థిని ఖరారు చేసే ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకుంది.

**- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక..**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభాగం నలుగురు కీలక నేతలతో కూడిన ఫైనల్ జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితాను తుది నిర్ణయం కోసం ఏఐసీసీ (అఖిల భారత కాంగ్రెస్ కమిటీ) కి పంపించినట్లు తెలుస్తోంది. షార్ట్‌లిస్టులో ఉన్న పేర్లు పార్టీలో ఉన్న బలమైన బీసీ నేతల ప్రాతినిధ్యాన్ని, స్థానిక పట్టును సూచిస్తున్నాయి.

**- జాబితాలో ఎవరెవరు ఉన్నారంటే..**

నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్ అండ్ అంజన్‌కుమార్ యాదవ్. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించడం కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకం, ఎందుకంటే ఇది హైదరాబాద్ నగరంలో పార్టీ పట్టును మరింత పటిష్టం చేస్తుంది. ఇక జూబ్లీహిల్స్‌లో ప్రధాన ప్రత్యర్థిగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ఉంది. గత ఎన్నికలలో ఈ స్థానాన్ని గెలుచుకున్న బీఆర్‌ఎస్, ఈసారి కూడా తమ ప్రాబల్యాన్ని నిలుపుకోవాలని చూస్తోంది.

2లో..

# స్థానిక ఎన్నికలపై ఈసీ గైడ్‌లైన్స్

## - డిపాజిట్ సహా పూర్తి వివరాలు వెల్లడి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. మొత్తం 5 దశల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, 3 దశల్లో సర్పంచ్, వార్డు ఎన్నికలకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రాణి కుముదిని షెడ్యూల్ విడుదల చేశారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. త్వరలో ఎన్నికలు జరగనున్నందున అభ్యర్థుల అర్హతలు, నామినేషన్, డిపాజిట్ నగదు, వ్యయం పరిమితులపై తెలంగాణ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది.

2లో..

# సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ



- పీజీ వైద్య విద్య మేనేజ్‌మెంట్ కోటా సీట్లపై హరీశ్ రావు స్పందన
- ఏపీలో 85 శాతం లోకల్ రిజర్వేషన్ ఉందని గుర్తు చేసిన హరీశ్
- ప్రస్తుత పీజీ నోటిఫికేషన్ రద్దు చేసి, కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు నష్టం జరుగుతోందని ఆరోపణ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య విద్య అభ్యసించాలనుకుంటున్న స్థానిక విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వందలాది సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు.

2లో..

# రేవంత్ 'ఫ్యూచర్' నెరవేరుతుందా.?

గుండా పోతూ, తెలంగాణలో 40% మాత్రమే ఉండగా, 60% ఆంధ్రలో ఉంటుంది. భూసేకరణ తెలంగాణలో 2 జిల్లాలు, ఆంధ్రలో 4 జిల్లాలకు విస్తరిస్తుంది. మచిలీపట్నం (బందర్) పోర్టుకు ఈ హైవే కనెక్ట్ అవ్వాలంటే, ఆంధ్ర ప్రభుత్వం 40% నిధులు కేటాయించాలి, అలైన్‌మెంట్ అంగీకరించాలి – ఇది బీఫ్ విషయంలో ఆంధ్ర వైఖరి (తెలంగాణపై ఆక్రోశం) కారణంగా అసాధ్యంగా మారింది. 2025 ఏప్రిల్‌లో హైదరాబాద్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్ర ఆమోదం వచ్చినప్పటికీ, మచిలీపట్నం వరకు విస్తరణపై ఆంధ్రతో చర్చలు ఆగిపోయాయి. 2014 ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్‌లో హైదరాబాద్– అమరావతి కనెక్టివిటీకి హామీ ఉన్నా, తెలంగాణ డ్రై పోర్ట్ అవసరాలు ఆంధ్రకు ఇబ్బందికరంగా ఉన్నాయి. నిపుణులు, ఈ రాజకీయ టెన్షన్లు ప్రాజెక్ట్‌ను 11 సంవత్సరాలు ఆలస్యం చేశాయని, ఇప్పుడు కూడా సమానంగా సహకారం లేకపోతే విఫలమవుతుందని విశ్లేషిస్తున్నారు.

**- అవకాశాలు, రిస్కులు..**

ఫ్యూచర్ సిటీ తెలంగాణ జీడీపీని డబుల్ చేస్తూ, 70 జీసీసీలు (2024), 25 మరిన్ని (2025) వంటి ఇన్వెస్ట్‌మెంట్లను పెంచుతుంది. డ్రై పోర్ట్, రాడియల్ రోడ్లు (ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్య 12 మార్గాలు) లాంటి ఇన్‌ఫ్రా, స్టార్టప్‌లు, మాన్యుఫాక్చరింగ్‌ను బూస్ట్ చేస్తాయి. కానీ, రిస్కులు కూడా ఉన్నాయి. భూసేకరణ వివాదాలు, లా అండ్ ఆర్డర్ సమస్యలు (అంటి– సోషల్ ఎలిమెంట్స్‌పై స్ట్రిక్ట్ యాక్షన్ ప్రణాళిక ఉన్నా), మూలాల ప్రచారం వంటివి ప్రాజెక్ట్‌ను ఆపేస్తాయి. ఆంధ్రతో ఇంటర్‌స్టేట్ కోఆర్డినేషన్ లేకపోతే, మచిలీపట్నం కనెక్టివిటీ దెబ్బతింటుంది, ఇది తెలంగాణ వ్యాపారానికి (సీపోర్ట్ లేకపోవడం) పెద్ద లాస్. రేవంత్ మొహోత్సవం, లా అండ్ ఆర్డర్‌ను బలోపేతం చేస్తూ, ఒప్పోజిషన్ 'ఫాల్స్ ప్రాపగాండా'కు డేంబ్ చేస్తున్నారు, కానీ రియల్ ప్రొగ్రెస్ కేంద్ర – రాష్ట్ర సమన్వయంపై ఆధారపడి ఉంది.సవాళ్ల మధ్య రేవంత్ రెడ్డి ఆశలు నెరవేరాలంటే, రాజకీయాలకు అతీతంగా కేంద్రం, ఆంధ్ర సహకారం కావాలి. మచిలీపట్నం హైవే విస్తరణ ఆమోదం (118 కి.మీ. తెలంగాణ, మిగతా ఆంధ్ర) లేకపోతే, ప్రాజెక్ట్ పరిమితంగా ఉంటుంది. ఇది తెలంగాణకు మణిహారంగా మారితే, రేవంత్ పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. లేకపోతే, రాజకీయ ఆటంకాలకు బలవంతపు ఉదాహరణగా మారుతుంది.

# బీహార్ నుంచే అన్నీ మొదలు

పేర్కొన్నారు. ఇకపై దేశవ్యాప్తంగా ఎక్కడ ఎన్నికలు జరిగినా సీరియల్ నంబర్ ఫాంట్ పెద్దదిగా ఉంటుందని, అభ్యర్థుల ఫోటోలు రంగుల్లో ఉంటాయని అన్నారు. ఈ మార్పులు మొదట బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే అమలులోకి రానున్నాయని, ఆ తర్వాత దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తామని పేర్కొన్నారు. దీంతో పాటు ఏ పోలింగ్ స్టేషన్‌లోనూ 1,200 మందికి మించి ఓటర్లు ఉండకూడదని నిర్ణయించుకున్నట్లు జ్ఞానేష్ కుమార్ వెల్లడించారు. బూత్ స్థాయి అధికారులను గుర్తించడానికి ఐడీ కార్డులు ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. బూత్ స్థాయి సిబ్బందిని గుర్తించడానికి ఓటర్లకు ఈ ఐడీ కార్డులు ఉపయోగపడతాయని అన్నారు.మొబైల్ ఫోన్‌లను బూత్ బయటే జమ చేయాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియ బిహార్ అంతటా అమలవుతుందని వివరించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ తో కవర్ చేస్తామని జ్ఞానేష్ కుమార్ చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 22లోగా పూర్తవుతాయని, ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) గడువులోగా పూర్తయిందని ప్రకటించారు. మొత్తం 243 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు ఎస్టీలు, 38 ఎస్సీలకు కేటాయించినట్లు వివరించారు. సోషల్ మీడియాపై నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని సీఈసీ చెప్పారు. దాదాపుగా అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ పై తప్పుడు సమాచారం పోస్ట్ కాకుండా గట్టి పర్యవేక్షించాల్సి ఉందని, ఈ దిశగా కొన్ని చర్యలను తీసుకుంటామని వ్యాఖ్యానించారు. బీజేపీ, కాంగ్రెస్, జేడీ (యూ), ఆర్‌జేడీ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, సీపీఐ (ఎం), సీపీఐ, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), బహుజన్ సమాజ్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చలు జరిపామని అన్నారు.

# జగన్ నేర్పిన గుణపాఠం

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందడంతో ప్రజల్లో సంతృప్తి కనిపించింది. ఈ దశలో నవరత్నాల్లో చెప్పని హామీలను సైతం అమలు చేయడం ప్రారంభించారు జగన్మోహన్ రెడ్డి. దీంతో జనాలు కూడా జగన్మోహన్ రెడ్డి విషయంలో మరింత ఆకర్షవంతులయ్యారు. అదే సమయంలో కరోనా కష్టకాలం. ఉపాధి గగనమవుతున్న వేళ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలు ప్రజలకు కొండంత అండగా నిలిచాయి. అయితే కోవిడ్ తర్వాత ప్రజల ఆదాయ వనరులు పెరిగాయి. ఆ సమయంలో ప్రజల్లో సంక్షేమ పథకాలు కంటే అభివృద్ధి కోసం వెతుకులాట ప్రారంభం అయింది. ఈ క్రమంలోనే చిన్నపాటి అసంతృప్తి మొదలైంది. అనతి కాలంలోనే అది పతాక స్థాయికి చేరింది. అదే సమయంలో ఎమ్మెల్యేలను కాదు, తనను చూసి ఓటు వేస్తారని జగన్మోహన్ రెడ్డి భ్రమించారు. కానీ ఆయన ఒకటి తలిస్తే ప్రజలు మరోలా తీర్పు ఇచ్చారు. దారుణమైన ఓటమిని కట్టబెట్టారు.

**- అన్నీ చేస్తున్నామంటే కుదరదు..**

అందుకే ఇప్పుడు చంద్రబాబు ఈ విషయంలో జాగ్రత్తలు పడుతున్నారు. ఒకవైపు పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నాం. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకొస్తున్నాం. అన్నింటికీ మించి రాష్ట్ర తలసరి ఆదాయాన్ని పెంచుతున్నాం. ఇది ఒక్కటే సరిపోదు. ఎమ్మెల్యేల పనితీరు కూడా బాగుండాలి. ప్రజలతో క్షేత్రస్థాయిలో సంబంధాలు కలిగింది వారే. అందుకే జగన్మోహన్ రెడ్డి గుర్తించని ఈ అంశాన్ని చంద్రబాబు ముందుగానే గుర్తించారు. పార్టీ ఎమ్మెల్యేలను కట్టడి చేయాలని భావిస్తున్నారు. ముందుగా ఇంచార్జ్ మంత్రులకు ఆ బాధ్యతలు అప్పగించారు. తరువాత తానే నేరుగా రంగంలోకి దిగనున్నారు. ముందుగానే చంద్రబాబు ఈ పరిస్థితిని గమనించడం నిజంగా అభినందించదగ్గ విషయం. మరి దీంట్లో ఎంతవరకు వర్కౌట్ చేసుకుంటారో చూడాలి.

# బస్సు చార్జీల పెంపు దారుణం

పేద, మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టేందుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పన్నిన కుట్ర అని కేటీఆర్ విమర్శించారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో తెలంగాణ ప్రజలు అల్లాడుతున్న సమయంలో బస్సు ఛార్జీల పెంపు వారి నెత్తిన పిడుగులాంటిదని కేటీఆర్ అన్నారు. ప్రతి నిత్య ప్రయాణికుడిపై నెలకు కనీసం రూ.500 అదనపు భారం పడుతుందని బడుగుజీవులు, దినసరి కూలీలు ఆర్టీసీ ఛార్జీల పెంపుతో ఎలా బతకాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికే విద్యార్థుల బస్ పాస్ ఛార్జీలు, టీ24 టిక్కెట్ ఛార్జీలను పెంచింది చాలదన్నట్టు, రెగ్యూలర్ ఛార్జీపై ఏమాత్రం కనికరం లేకుండా 50 శాతం ధరలను పెంచడం సీఎం రేవంత్ రెడ్డి అసమర్థ, అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనం అని కేటీఆర్ మండిపడ్డారు. రాజధాని హైదరాబాద్ వాసుల నడ్డివిరిచేలా ప్రతి నిత్యం దాదాపు కోటి రూపాయల భారాన్ని ప్రజలపై మోపాలని చూస్తున్న రేవంత్ రెడ్డి జంట నగరాల ప్రజలపై కక్ష పెంచుకుంటున్నారని వ్యాఖ్యానించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జంటనగరాల్లో కాంగ్రెస్ ని ప్రజలు పూర్తిగా తిరస్కరించారనే కసితోనే రేవంత్ రెడ్డి ప్రతీకార చర్యలకు దిగుతున్నారని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉచిత బస్సు పథకంతో రాష్ట్ర ఆర్టీసీ సంస్థను దివాళా తీయించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు సామాన్య ప్రయాణికుల నడ్డి విరచాలని చూస్తోందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలన వలన రాష్ట్ర ప్రగతి రథచక్రాలే కాదు, చివరికి ఆర్టీసీ ప్రగతి రథచక్రాలు సైతం ధ్వంసం చేసిన పాపం సీఎం రేవంత్ రెడ్డితో పాటు, కాంగ్రెస్ సర్కారును కుప్పకూల్చే వరకూ వెంటాడుతుందని హెచ్చరించారు.

# నా రాజీనామా వార్తలు అవాస్తవం

"నాపై గిట్టనివాళ్లే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. నేను రాజీనామా చేస్తున్నాననే వార్త పూర్తిగా అవాస్తవం" అని ఆయన తేల్చిచెప్పారు. తనపై రాజకీయంగా కుట్ర జరుగుతోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పార్టీకి, ప్రజలకు తాను ఎప్పుడూ అంకితభావంతో పనిచేస్తానని, పదవులు వదులుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.గతంలో కాంగ్రెస్‌లో కీలక నేతగా ఉన్న దానం నాగేందర్, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి మంత్రిగా కూడా పనిచేశారు. ఇటీవలే తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, ఖైరతాబాద్ నియోజకవర్గంలో బలమైన నేతగా కొనసాగుతున్నారు. ఇలాంటి తరుణంలో ఆయన రాజీనామాపై వస్తున్న వదంతులు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ కష్టకాలంలో తనకు మద్దతుగా నిలుస్తున్న ప్రజలకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ దుష్ప్రచారం వెనుక ఎవరున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తానని దానం నాగేందర్ సూచనప్రాయంగా తెలిపారు.

# ప్రజల ఆరోగ్యంతో చెలగాటం న్యాయమేనా.?

కాగ్ నివేదికలను ప్రస్తావిస్తూ జగన్ గణాంకాలను వెల్లడించారు. 2024–25 ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం అమ్మకాల ద్వారా రూ. 6,782.21 కోట్ల ఎక్సైజ్ ఆదాయం రాగా, 2025–26లో టీడీపీ ప్రభుత్వం వచ్చాక విచ్చలవిడిగా అమ్మకాలు పెంచినా కేవలం రూ. 6,992.77 కోట్లు మాత్రమే వచ్చిందని తెలిపారు. ఇది కేవలం 3.10 శాతం పెరుగుదల మాత్రమేనని, సహజంగా రావాల్సిన 10 శాతం వృద్ధి కూడా లేకపోవడం వెనుక భారీ దోపిడీ దాగి ఉందని ఆరోపించారు. ప్రభుత్వానికి చేరాల్సిన ఆదాయమంతా సిండికేట్ల రూపంలో టీడీపీ నేతల జేబుల్లోకి వెళుతోందని ఆయన పేర్కొన్నారు. ములకలచెరువు ఘటనలో కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని జగన్ ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న జిల్లా స్థాయి టీడీపీ ఇన్‌ఛార్జిని కాపాడేందుకు, విదేశాల్లో ఉన్న వ్యక్తిపై నెపం నెట్టి కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలతోనే రాత్రికి రాత్రే కేసును మార్చేశారని, ఈ దందాకు ప్రభుత్వ పూర్తి సహకారం ఉందని ఆరోపించారు. సొంత ఆదాయం కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడం న్యాయమేనా అని జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# కేసుల్లో కూరుకుపోతున్న విజయ్

ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. తాజాగా విజయ్ ఎన్నికల ప్రచార వాహనం డ్రైవర్‌పై కేసు నమోదైంది. మనుషుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా వాహనం నడిపినందుకు కరూర్ వేలాయుధపాళ్యం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వాహనాన్ని సీజ్ చేశారు. ప్రమాదానికి కారణమైన విజయ్ ప్రచార వాహనాన్ని ఎందుకు స్వాధీనం చేసుకోకూడదని మద్రాస్ హైకోర్టు పోలీసు అధికారులను ప్రశ్నించిన మరుసటి రోజే ఈ ఘటన చోటు చేసుకుంది.తొక్కిసలాట ఘటనపై దాఖలైన పిటీషన్ విచారణ సందర్భంగా మద్రాస్ హైకోర్టు టీవీకేపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. విజయ్ ప్రచార వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడాన్నీ తప్పుపట్టింది. ఈ ఘటనలో విజయ్ ప్రచార వాహనాన్ని ఇంకా ఎందుకు ఇంకా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, వాహనాన్ని ఇంకా స్వాధీనం చేసుకోలేదని నిలదీసింది. వాహనం ప్రయాణించిన మార్గంలో బయటి, లోపలి సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకోవాలని కూడా కోర్టు ఆదేశించింది. కరూర్ ఘటన మానవ తప్పిదమని, చట్టానికి ఎవరూ అతీతులు కారని స్పష్టం చేసింది. పిల్లలు మరణించినా కూడా విజయ్ అక్కడి నుంచి వెళ్లిపోయాడని, తన అనుచరులను వదిలేసిన వ్యక్తికి నాయకత్వ లక్షణాలు లేవని కఠినంగా వ్యాఖ్యానించింది. ఇది ఎలాంటి రాజకీయ పార్టీ అని కోర్టు అసహనం వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తులో ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించింది. దీంతో పోలీసులు సత్వరమే స్పందించారు. విజయ్ ప్రచార వాహనం కేసు నమోదు చేశారు.ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు చంద్రుపైనా కేసు పెట్టారు. అలాగే– ఆ వాహనం డ్రైవర్ పై హిట్ అండ్ రన్ కింద కేసు నమోదు చేశారు పోలీసులు. టీవీకే కార్యాలయం నుంచి ఈ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ స్టేషన్ కు తరలించారు. ప్రస్తుతం విజయ్ ప్రచార వాహనం చెన్నై పనయూరులో నిలిపి ఉంచారు. దీనిపై తదుపరి విచారణ కొనసాగుతోంది. మద్రాస్ హైకోర్టు జోక్యం అనంతరం మరిన్ని అరెస్టులు ఉండొచ్చని తెలుస్తోంది.

# జూబ్లీహిల్స్ రేసులో నలుగురు అభ్యర్థులు

దీనిలో భాగంగానే బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పేరును ఖరారు చేశారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కూడా తమ అభ్యర్థి ఎంపికపై కసరత్తు చేస్తోంది. బీజేపీ అభ్యర్థి ఎంపిక కోసం కమిటీని ఏర్పాటు చేసింది. త్రిముఖ పోరు జరిగే ఈ స్థానంలో.. అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ట, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయం విజయాన్ని నిర్ణయిస్తాయి.

**- న్యాయపరమైన వివాదాలు..**

మరోవైపు, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై నెలకొన్న న్యాయ వివాదం కారణంగా రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత పెరిగింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కావడం ఈ ఎన్నికల షెడ్యూల్‌పై ప్రభావం చూపుతుందనే ఆందోళన ఉంది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఢిల్లీ పర్యటనకు వెళ్లడం అత్యంత ముఖ్యమైన పరిణామం. వారు ఢిల్లీలోని సీనియర్ న్యాయవాదులను కలిసి, సుప్రీంకోర్టులో ఈ రిజర్వేషన్ల అంశంపై బలమైన వాదనలు వినిపించేలా చర్చలు జరుపుతారు. బీసీలకు అధిక రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా.. స్థానిక ఎన్నికలలో ఆ వర్గం మద్దతును గెలుచుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వ్యూహాన్ని అమలు చేస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటం, కొత్త సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో ఆశలు ఉండటం అనుకూలంగా మారవచ్చు. అయితే బీఆర్ఎస్ బలమైన స్థానిక బలం పోటీని పెంచుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆరు గ్యారెంటీలు' ప్రామాణికతను తెలుపుతాయి. బీసీ రిజర్వేషన్లను విజయవంతంగా అమలు చేసి, న్యాయపరమైన సవాళ్లను అధిగమిస్తే ఆ వర్గంలో కాంగ్రెస్ పట్ల సానుకూలత పెరుగుతుంది. లేదంటే ఇది ప్రతిపక్షాలకు అనుకూలంగా మారవచ్చు. మొత్తంగా ఢిల్లీ చర్చలు, జూబ్లీహిల్స్ అభ్యర్థి ప్రకటన, సుప్రీంకోర్టు తీర్పు ఈ మూడు అంశాలు తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పే అవకాశం ఉంది.

# స్థానిక ఎన్నికలపై ఈసీ గైడ్‌లైన్స్

**- రేషన్ డీలర్లు కూడా పోటీ చేయవచ్చు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో రేషన్ డీలర్లు పోటీ చేయడానికి అవకాశం ఉంది. అయితే నామినేషన్ల పరిశీలన తేదీ నాటికి 21 ఏళ్లు నిండిన వారిని అర్హులుగా పరిగణిస్తారు. గ్రామ సేవకులు, అంగన్వాడీ కార్యకర్తలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఎయిడెడ్ సంస్థలు, స్థానిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సైతం పోటీ చేయవచ్చు. పోటీ చేసే గ్రామం, స్థానిక నియోజకవర్గంలో అభ్యర్థి ఓటు హక్కు కలిగి ఉండాలి.

**- పోటీ చేసేందుకు వీరు అనర్హులు**

మతసంబంధమైన సంస్థల చైర్మన్లతో పాటు సభ్యులకు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. సింగరేణి, ఆర్టీసీలో మేనేజింగ్ ఏజెంట్, మేనేజర్ లేదా సెక్రటరీ హోదాలో పనిచేసే వారు మినహా ఇతర ఉద్యోగులు పోటీకి అర్హులు. క్రిమినల్ కోర్టులో కొన్ని నేరాలకు శిక్ష పడిన వారు, శిక్ష విధించిన తేదీ నుంచి 5 సంవత్సరాల వరకు ఎన్నికకు అనర్హులవుతారు. పౌర హక్కుల పరిరక్షణ చట్టం–1955 పరిధిలోకి వచ్చే కేసుల్లో శిక్ష పడినవారు పోటీ చేసేందుకు అనర్హులు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏదైనా పనికి కాంట్రాక్టు చేసుకున్నా లేదా నిర్వహణకు ఒప్పందం చేసుకున్నా (కాంట్రాక్టర్లు) స్థానిక ఎన్నికల్లో అనర్హులు అవుతారు.

**- అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పరిమితి ఎంత..**

స్థానిక సంస్థల అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ధారించింది. జడ్పీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ.1.5 లక్షలు ఖర్చు చేయవచ్చు. ఇక 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థి రూ.2.5 లక్షల వరకు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే రూ.1.5 లక్షల వరకే ఖర్చు చేయాలని ఈసీ పేర్కొంది. అలాగే 5000 కంటే జనాభా ఎక్కువ ఉన్న పంచాయతీలో వార్డు సభ్యుడు రూ.50 వేలు, 5 వేల కంటే తక్కువ జనాభా ఉంటే గరిష్టంగా రూ.30 వేలు ఖర్చు చేయవచ్చు. అభ్యర్థులు తప్పనిసరిగా తమ బ్యాంక్ ఖాతా వివరాలను సమర్పించాలి. దాంతో పాటు ఎన్నికల ఖర్చుల వివరాలు ఇవ్వాలి. అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు తమ అర్హతలు, క్రిమినల్ చరిత్ర, ఆస్తులతో పాటు అప్పులు, చదువు వివరాలపై సెల్ఫ్ డిక్లరేషన్ అఫిడవిట్ దాఖలు చేయాలి. ఒక్క వివరాలు లేకపోయినా నామినేషన్ రిజెక్ట్ అవుతుంద. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.

**- అభ్యర్థులు ఎంత డిపాజిట్ చేయాలి..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పోటీచేసే కేటగిరీని బట్టి డిపాజిట్ చేయాలి. జడ్పీటీసీ అభ్యర్థి (జనరల్) అయితే రూ.5 వేలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు అయితే రూ. 2,500 డిపాజిట్ చేయాలి. ఎంపీటీసీ అభ్యర్థులు రూ.2,500 (జనరల్) ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1,250, సర్పంచ్ అభ్యర్థి జనరల్ అయితే రూ.2 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1000, వార్డు సభ్యుడు జనరల్ అయితే రూ.500 ఎస్సీ, ఎస్టీ, బీసీలు యితే రూ.250 డపాజిట్ చేయాలి. అభ్యర్థులు పంచాయతీల పన్ను బకాయిలతో పాటు కరెంట్ బిల్లులు చెల్లించి రసీదులు తీసుకోవాలి. ముఖ్యంగా అభ్యర్థులు క్యాస్ట్ సర్టిఫికెట్స్ తీసుకుని ఉండాలి.

# సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో మొత్తం 1,801 పీజీ సీట్లు అందుబాటులో ఉండగా, అందులో సగం రాష్ట్ర కోటా కింద భర్తీ అవుతాయని తెలిపారు. ఈ రాష్ట్ర కోటాలోని 25 శాతం, అంటే సుమారు 450 సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కిందకు వస్తాయని వెల్లడించారు. అయితే, ఈ సీట్లలో స్థానిక విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించకపోవడంతో అవన్నీ ఓపెన్ కేటగిరీలో ఇతర రాష్ట్రాల వారికి దక్కుతున్నాయని హరీశ్ రావు తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85 శాతం స్థానికులకే కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారని ఆయన గుర్తు చేశారు. అదే విధానాన్ని తెలంగాణలో అమలు చేస్తే, 450 సీట్లలో కేవలం 68 సీట్లు మాత్రమే ఇతర రాష్ట్రాలకు వెళతాయని, మిగిలిన 382 సీట్లు తెలంగాణ విద్యార్థులకే లభిస్తాయని ఆయన వివరించారు. ప్రస్తుత విధానం వల్ల మన విద్యార్థులు ఈ విలువైన అవకాశాన్ని కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాల కోసం కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో పాటు, 2014 తర్వాత స్థాపించిన కాలేజీల్లో 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను స్థానికులకే కేటాయించామని హరీశ్ రావు తెలిపారు. దీనివల్ల ఏటా 1,820 అదనపు ఎంబీబీఎస్ సీట్లు మన విద్యార్థులకు దక్కాయని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే స్పందించి మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం స్థానిక రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం జారీ చేసిన పీజీ ప్రవేశాల నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేసి, తెలంగాణ విద్యార్థుల హక్కులను కాపాడేలా కొత్త జీవో జారీ చేయాలని తన లేఖలో కోరారు.

## కరూర్ తొక్కిసలాట.. ప్రచారరథం సీజ్..

# డ్రైవర్‌పై కేసు నమోదు



కరూర్ తొక్కిసలాట ఘటనకు ముందు టీవీకే చీఫ్ , నటుడు విజయ్ ప్రచారరథం ఇద్దరు యువకులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆ ప్రచారరథాన్ని సీజ్ చేశారు. ఆ వాహనం నడిపిన డ్రైవర్‌ను విచారిస్తున్నారు. ఇటీవల తమిళనాడులోని కరూర్ జిల్లాలో విజయ్ నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఎందుకంటే ఈ ఘటనలో ఏకంగా 41 మంది మరణించారు. 80 మందికిపైగా గాయపడ్డారు. ఇదిలావుంటే ఈ ఘటనపై దర్యాప్తు కోసం ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను వేగవంతం చేసింది. ఈ క్రమంలో పోలీసులు మరో కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

## మూడేళ్ల కుమార్తెను చంపిన మహిళ..

# ఆమెతోపాటు ప్రియుడు అరెస్ట్

లక్నో: మూడేళ్ల కుమార్తెను ప్రియుడితో కలిసి మహిళ హత్య చేసింది. చిన్నారి మృతదేహాన్ని కాలువలో పడేశారు. వివాదం ఉన్న పొరుగింటి మహిళపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులైన ఆ మహిళ, ఆమె ప్రియుడ్ని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నరోరా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో నివసిస్తున్న సీమా అలియాస్ లాలి భర్త కొన్నేళ్ళ కిందట మరణించాడు. దీంతో ప్రియుడు యతేంద్రతో సహజీవనం చేస్తున్నది. మూడేళ్ల కుమార్తె దివ్యాంశితో పాటు అతడితో కలిసి నివసిస్తున్నది.కాగా, సీమా పనికి వెళ్లినప్పుడు ఆమె కుమార్తె ఇబ్బంది పెడుతున్నదని ప్రియుడు యతేంద్ర ఆరోపించాడు. ఆ చిన్నారి విషయంపై వీరిద్దరి మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కూతురి అడ్డు తొలగించుకునేందుకు సీమా ప్లాన్ వేసింది. అక్టోబర్ 1న ప్రియుడితో కలిసి దివ్యాంశిని హత్య చేసింది. బాలిక మృతదేహాన్ని నరోరా గంగా కాలువలో పడేశారు.మరోవైపు అదే రోజున తన కుమార్తె అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీమా ఫిర్యాదు చేసింది. వివాదం ఉన్న స్థానిక మహిళ లాల్‌త్రేష్, ఆమె సంబంధీకులపై నెపం నెట్టేందుకు ప్రయత్నించింది. తన కుమార్తెను చంపేందుకు వారు కిడ్నాప్ చేసినట్లు ఆరోపించింది.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే రోజున కాలువలో చిన్నారి దివ్యాంశి మృతదేహాన్ని గుర్తించారు. సీమా తన ప్రియుడు యతేంద్రతో కలిసి కుమార్తెను హత్య చేసినట్లు దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు.సీమాను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నిజం ఒప్పుకున్నదని పోలీస్ అధికారి తెలిపారు. ఆమెతో పాటు ప్రియుడు యతేంద్రను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మకూర్ ఎస్: సూర్యాపేట జిల్లా ఆత్మకూరు ఎస్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000ల బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఉత్సాహంగా జరిగింది. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 50మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో గతంలో సేవలందించిన ఉపాధ్యాయులు సిహెచ్.రాంరెడ్డి, తంగెళ్ళ పెద వీరారెడ్డి, కాసర్ల వీరారెడ్డి, శంకర్, చల్లా సత్యనారాయణ, సోమయ్య, జి.సుధాకర్‌రెడ్డి, వి.యాదయ్యలను సన్మానించారు. పూర్వ విద్యార్థులు మధు, రవి, సుచరిత, పార్వతమ్మలు కార్యక్రమాన్ని సమన్వయం చేసి పాఠశాల పట్ల తమకున్న అనుబంధాన్ని స్మరించుకొని విద్యార్థుల మేలు కోసం సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# హైదరాబాద్ -విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్‌జామ్..



హైదరాబాద్ : దసరా సెలవులు ముగియడంతో.. గ్రామాల నుంచి హైదరాబాద్ నగరానికి ప్రజలు తిరుగు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్ నగరానికి వచ్చే అన్ని రహదారులు వాహనాలతో రద్దీగా మారాయి. మరి ముఖ్యంగా హైదరాబాద్ – విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. కిలోమీటర్ల మేర వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. కార్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రయివేటు వాహనాలు ఒకదాని వెంట మరొకటి బారులు తీరాయి. దీంతో చిట్యాల, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద రద్దీ నెలకొంది. వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి. మరోవైపు ప్రయాణికులతో ఆర్టీసీ, ప్రయివేటు బస్సులు కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలను పోలీసులు క్రమబద్దీకరిస్తున్నారు.

## 14 ఏళ్ల తర్వాత తండ్రి హత్యకు ప్రతీకారం తీర్చుకున్న కొడుకు.. వ్యక్తిపై కాల్పులు




లక్నో: ఒక వ్యక్తి 14 ఏళ్ల తర్వాత తండ్రి హత్యకు ప్రతీకారం తీర్చుకున్నాడు. హంతకుడిపై కాల్పులు జరిపి చంపాడు. పారిపోయిన ఆ వ్యక్తిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని షామ్లి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మంగళోరా గ్రామానికి చెందిన 45 ఏళ్ల జైవీర్ 2011లో బ్రిజ్‌పాల్‌ను హత్య చేశాడు. ఈ కేసులో 11 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత గత మూడు సంవత్సరాలుగా గ్రామంలో నివసిస్తున్నాడు.కాగా, తండ్రి బ్రిజ్‌పాల్ హత్యకు ప్రతీకారం కోసం కుమారుడైన 30 ఏళ్ల రాహుల్ ఎదురుచూశాడు. శనివారం పొలం నుంచి ఇంటికి వెళ్తున్న జైవీర్‌పై గన్‌తో కాల్పులు జరిపి హత్య చేశాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జైవీర్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి హత్యకు ప్రతీకారంగా రాహుల్ అతడ్ని చంపినట్లు దర్యాప్తులో తెలుసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న రాహుల్‌ను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## నిండు కుండలా నాగార్జున సాగర్.. 22 గేట్లు ఎత్తివేత



హైదరాబాద్ : నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో జలాశయం నిండు కుండలా మారింది. దీంతో ప్రాజెక్టు 22 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 2.27 లక్షల క్యూసెక్కులుగా ఉంది. సాగర్ కుడి కాల్వకు 10,040 క్యూసెక్కులను, ఎడమ కాల్వకు 8,896 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాగర్ పవర్ హౌస్‌కు 33,739 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 1.72 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 587.50 అడుగులుగా ఉంది. సాగర్ నీటినిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు, ప్రస్తుత నీటినిల్వ 305.80 టీఎంసీలుగా ఉంది.

## అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులకు దరఖాస్తుల గడువు పెంపు




హైదరాబాద్ : 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఎస్ఎల్‌పీఆర్బీ) దరఖాస్తులు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 5వ తేదీన సాయంత్రం 5 గంటలతో దరఖాస్తుల గడువు ముగియనుంది. కానీ వరుసగా సెలవులు రావడం, అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తుల గడువు పొడిగించారు. అయితే ఈ పోస్టులకు 7183 మంది రిజిస్ట్రర్ చేసుకోగా, ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు 2193 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. అంటే కేవలం 30 శాతం మంది తమ దరఖాస్తులను సమర్పించారు. ఈ మేరకు టీఎస్ఎల్‌పీఆర్బీ అధికారిక ప్రకటన విడుదల చేశారు. తదితర వివరాలకు www.tgprb.in వెబ్‌సైట్ సందర్శించాలని సూచించింది. రాష్ట్రంలోని క్రిమినల్ కోర్టుల్లో మూడేండ్లకుపైగా ప్రాక్టీస్ చేసిన న్యాయవాదులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నది

# ఇద్దరు ఆయాల గొడవతో రెండు నెలల పసికందు బలి.. అనంతపురంలో విషాదం



దసరా సెలవు విషయంలో ఇద్దరు ఆయాల మధ్య జరిగిన గొడవకు రెండు నెలల పసికందు బలైంది. సెలవు దొరక్క విధుల్లోకి వచ్చిన ఆయా.. చిన్నారికి పాలుపట్టకపోవడంతో ఆకలితో ఏడ్చి ఏడ్చి మరణించింది. ఈ విషయాన్ని దాచిపెట్టేందుకు మృతదేహాన్ని శ్మశానంలో రహస్యంగా పాతిపెట్టారు. కానీ సిబ్బంది మధ్య విభేదాల కారణంగా ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకి వెళ్తే.. కల్యాణదుర్గానికి చెందిన ఓ మహిళ తనకు జన్మించిన మగ శిశువును పోషించలేక ఆగస్టు 30వ తేదీన అనంతపురంలోని ఐసీడీఎస్ అనుబంధ శిశుగృహకు అప్పగించింది. అప్పటి నుంచి వారే ఆ శిశువును సంరక్షిస్తున్నారు. సాధారణంగా రాత్రిపూట శిశు సంరక్షణ కేంద్రంలో ఇద్దరు ఆయాలు విధుల్లో ఉండాల్సి ఉంటుంది. కానీ అక్టోబర్ 2వ తేదీ దసరా రోజున ఒకరు మాత్రమే విధుల్లోకి వచ్చారు. ఏం జరిగిందో తెలియదు కానీ కొంతసేపటికి పసికందు ఆరోగ్యం బాగోలేదంటూ సర్వజన ఆస్పత్రికి ఆయా బిడ్డను తీసుకెళ్లింది. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే శిశువు మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయం బయటకు పొక్కకుండా శిశువును శ్మశానంలో పూడ్చివేశారు. అయితే సిబ్బంది మధ్య విభేదాలు ఉండటంతో ఈ విషయం బయటకు వచ్చింది.అక్టోబర్ 2వ తేదీన దసరా సందర్భంగా సెలవు విషయంలో ఇద్దరు ఆయాల మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో సెలవు దొరకని ఆయా అయిష్టంగానే విధుల్లోకి వచ్చింది. ఏ పని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉంది. పసికందు ఆకలితో ఎంత ఏడ్చినా సరే పాలుపట్టకుండా అలాగే ఉంది. ఇలా ఆకలితో అలమటించి, ఏడ్చి ఏడ్చి శిశువు మరణించినట్లు సమాచారం. శిశుగృహంలో పనిచేస్తున్న ఏఎన్ఎం కూడా తరచూ విధులకు హాజరుకావడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అంతేకాదు సిబ్బంది మధ్య ఎవరు ఏ పనులు చేయాలన్న దానిపై కూడా తరచూ గొడవలు జరుగుతున్నాయని సమాచారం. అధికారుల పరిశీలనలో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం స్పష్టంగా కనిపిస్తోందని భావిస్తున్నారు. కాగా, ఆ శిశువు ఆరోగ్యం బాగోలేకపోవడం వల్లే మృతి చెందిందని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగమణి చెప్పడం గమనార్హం. దీనిపై సమాచారం అందుకున్న కలెక్టర్ ఆనంద్ సమగ్ర నివేదిక అందించాలని పీడీని ఆదేశించారు.

## ఆ హత్యలపై దర్యాప్తు జరిపించకపోతే జైల్లోనే ఉంటా

**- సోనమ్ వాంగ్‌చుక్**




లధఖ్ కు రాష్ట్రహెూదా కోసం డిమాండ్ చేస్తూ ఇటీవల లేహ్ ప్రాంతంలో జనం నిరసనలకు దిగగా అల్లర్లు చెలరేగాయి. ఆ అల్లర్లలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 90 మందికిపైగా గాయపడ్డారు. దాంతో లధఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్ ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన జైలు నుంచి ఓ సందేశం పంపారు.లధఖ్ ఘర్షణల్లో నలుగురు ప్రాణాలు కోల్పోవడంపై స్వతంత్ర్య దర్యాప్తు జరిపించాలని, లేదంటే తాను జైల్లోనే ఉండిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని వాంగ్‌చుక్ తన సందేశంలో హెచ్చరించారు. కాగా, వాంగ్‌చుక్ ప్రస్తుతం జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉన్నారు. సోదరుడు కాత్సేతాన్ డోర్జే లేతో పాటు న్యాయవాది ముస్తఫా హాజీలు ఆయనను కలిసిన సందర్భంగా ఈ సందేశాన్ని పంపారు.తాను శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నానని, తన కోసం ప్రార్థిస్తున్న వారికి ధన్యవాదాలు అని తన సందేశంలో వాంగ్‌చుక్ పేర్కొన్నారు. ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నానని, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. నలుగురి హత్యలపై న్యాయ విచారణ జరగాలని డిమాండ్ చేశారు.లేదంటే తాను జైలులోనే ఉండేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. లధఖ్‌కు రాష్ట్రహెూదా కోసం ప్రజలు, లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఏడీఏ) చేస్తున్న డిమాండ్‌లకు మద్దతిస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాంతి, ఐక్యతను కాపాడుకోవాలన్నారు. అహింసా మార్గంలోనే మన పోరాటాన్ని శాంతియుతంగా కొనసాగించాలని ప్రజలకు సూచించారు. కాగా సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే లేహ్‌లో ఆందోళనలు జరిగాయని ఆరోపించిన కేంద్రం.. జాతీయ భద్రతాచట్టం కింద ఆయనను అరెస్ట్ చేయించింది. ఈ చట్టం కింద అరెస్టయిన వ్యక్తిని విచారణ చేయకుండా 12 నెలలపాటు నిర్బంధించేందుకు చట్టం అనుమతిస్తుంది. ఈ క్రమంలోనే తన భర్తను విడుదల చేయాలంటూ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జే ఆంగ్మో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆమె పిటిషన్‌పై సోమవారం విచారణ జరగనుంది.

## ఈతకు వెళ్లి చెరువులో మునిగి యువకుడు గల్లంతు



మధిర : సరదాగా ఈత కొట్టేందుకు చెరువులోకి వెళ్లిన ఒక యువకుడు నీటిలో మునిగి గల్లంతైన విషాద సంఘటన ఆదివారం ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని పెద్ద చెరువులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడు గ్రామానికి చెందిన విల్లారపు వంశీ (18) మధిరలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం వంశీ తనతో పాటు మరో ముగ్గురు యువకులతో కలిసి పెద్ద చెరువు వద్దకు చేరుకున్నారు. ?వారు ఈత కొట్టేందుకు చెరువులోకి దిగారు. అయితే, లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతానికి వెళ్లిన వంశీ నీటిలో మునిగిపోయాడు. దీంతో భయపడిన అతని మిత్రులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించారు. వంశీ మునిగిపోతున్న భయంతో వారిని బలంగా పట్టుకోవడంతో అతడిని రక్షించడం ఆ ముగ్గురు యువకులకు సాధ్యపడలేదు.?వారు ప్రాణభయంతో బయటకు వచ్చి, వెంటనే స్థానికులకు విషయం చెప్పారు. స్థానికులు వెంటనే గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వరద బీభత్సం.. ఏడుపాయల దుర్గమ్మ ఆలయానికి కోటి రూపాయల నష్టం



పాపన్నపేట: వరద బీభత్సం సృష్టించడంతో ఏడుపాయల ఆలయానికి కనీవినీ ఎరగని రీతిలో సుమారు కోటి రూపాయల నష్టం సంభవించింది. ఆలయ మంటపానికి ఉన్న గ్రిల్స్ , జనరల్, వీఐపీ క్యూ లైన్స్, మంటపం రేకులు వరద ఉధృతికి పూర్తిగా ధ్వంసం కావడంతో, ఆలయ ముఖచిత్రం పూర్తిగా అస్తవ్యస్థంగా మారింది. ఆలయ అధికారులు సరైన సమయంలో స్పందించి గ్రిల్స్ తొలగించి ఉంటే ఆలయానికి తీవ్ర నష్టం జరగకుండా ఉండేదని పలువురు భక్తులు వాపోతున్నారు.సంబంధిత ఆలయ ఉన్నతాధికారి ఇష్టానుసారంగా, చుట్టపు చూపుగా విధులకు హాజరుకావడమే కాకుండా ఆలయాన్ని పట్టించుకున్న పాపాన పోకపోవడంతో ఆలయానికి భారీ నష్టం సంభవించిందని భక్తులు ఆరోపిస్తున్నారు. నిజానికి వాతావరణ శాఖ , నీటి పారుదల శాఖ అధికారులు భారీ వర్షాలు సంభవిస్తాయని ముందస్తుగా హెచ్చరించారు. దీంతో సింగూరు ప్రాజెక్టు నుంచి నీరు పెద్ద ఎత్తున నిజాం సాగర్ ప్రాజెక్టు కు విడుదల చేస్తామని ముందస్తు సూచనలు చేసినప్పటికీ ఆలయ అధికారుల నిర్లక్ష్యమా, అలసత్వమో కానీ ఆలయ మంటపానికి తొలగించాల్సిన గ్రిల్స్ తొలగించక పోవడంతో వరద ఉధృతితో గ్రిల్స్ విరిగి వరదల్లో కొట్టుకు పోయాయి. దీంతో సుమారు కోటి రూపాల నష్టం సంభవించిందని ఆలయ ముఖ్య ఉద్యోగి ఒకరు వెల్లడించారు.ప్రతి ఏటా వర్షా కాలం సంభవించిన వెంటనే ఆలయానికి వరద తాకిడి ఏర్పడుతుందని తలంచి. గత నాలుగు ఏళ్ళ నుండి ఆలయ మంటపానికి వరదల నుండి నష్టం వాటిల్లకుండా గ్రిల్స్ దెబ్బతినకుండా ఉండేందుకు వాటిని తొలగించి మళ్లీ అమరచడం ఆనవాయితీగా కొనసాగుతుంది. అప్పటి ఆలయ ఈవో సార శ్రీనివాస్, గ్రిల్స్ ను అవసరాన్ని బట్టి విప్పి భద్రపరిచి మళ్ళీ ఏర్పాటు చేసే విధంగా గ్రిల్స్‌కు పట్టాలను, నట్టు బోల్ట్‌ను ఏర్పాటు చేసి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టేవారు.సింగూరు ప్రాజెక్టు నుంచి పెద్ద ఎత్తున నీరు వదిలినప్పుడు ఆలయ మంటపానికి ఉన్న గ్రిల్స్ తొలగించి భద్రపరుస్తూ ఉండేవారు. మళ్లీ వరదలు తగ్గిన వెంటనే వాటిని తిరిగి ఆలయ మంటపానికి బిగించేవారు. అయితే ఈ సంవత్సరం ఆగస్టు 12న సింగూరు ప్రాజెక్టు నుంచి నిజాం సాగర్ ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున నీరు వదులుతున్నట్టు ముందే సంబంధిత శాఖ అధికారులు సూచించినప్పటికీ.. ఆలయ అధికారులు కేవలం హుండీలను ఆలయం నుండి తొలగించి భద్రపరిచారే తప్ప ఆలయ మంటపానికి ఉన్న గ్రిల్స్ తొలగించకపోవడంతో ఆగస్టు 14న ఆలయం జలదిగ్బంధంలోకి వెళ్లి సుమారు 52 రోజుల పాటు ఆలయం మంజీరా ఉధృతిలో ఉండిపోయింది. దీంతో రాజగోపురంలోనే అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.అయితే గత రెండు రోజుల నుంచి వరద ఉధృతి తగ్గడంతో ఆలయం జలదిగ్బంధం నుండి విముక్తి పొందింది. అయితే ఆదివారం ఆలయ సిబ్బంది ఆలయానికి వెళ్లి పరిశీలించగా పెద్ద ఎత్తున నష్టం సంభవించింది. ఆలయాన్ని శుద్ధి చేసే పనిని ప్రారంభించారు. అయితే ఆలయ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఆలయ మంటప గ్రిల్స్ వరద తాకిడికి ధ్వంసం అయ్యాయని పలువురు భక్తులు అధికారులపై మండిపడుతున్నారు. ఏది ఏమైనా ఆలయ అభివృద్ధికి పాటు పడాల్సిన అధికారుల నిర్లక్ష్యం మూలంగా లక్షల సొత్తు వృధా అయ్యిందని భక్తులు వాపోతున్నారు.

## జాతి హింస జరిగి రెండేళ్ల తర్వాత.. చురాచంద్‌పూర్‌లో పోస్టల్ సేవలు పునఃప్రారంభం




ఇంఫాల్: మణిపూర్‌లోని చురాచంద్‌పూర్‌లో జాతి హింస కారణంగా రెండు సంవత్సరాల పాటు నిలిచిపోయిన పోస్టల్ సేవలు శనివారం తిరిగి ప్రారంభమయ్యాయి. గత వారం రోజులుగా రాజధాని ఇంఫాల్ నుంచి చురాచంద్‌పూర్‌కు సాధారణ మెయిల్ వ్యాన్‌లు వస్తున్నాయి. దీంతో పోస్టల్ సేవలు పునఃప్రారంభమయ్యాయి. కాగా, మణిపూర్‌లోని మైతీ, కుకీ తెగల మధ్య రెండేళ్లుగా హింసాకాండ కొనసాగింది. అల్లర్లు, దాడుల్లో 250 మందికి పైగా మరణించగా వేల సంఖ్యలో గాయపడ్డారు. సుమారు 62,000 మంది నిరాశ్రయులయ్యారు. మరోవైపు ఈ హింసాకాండలో అత్యంత ప్రభావితమైన జిల్లాల్లో చురాచంద్‌పూర్ ఒకటి. దీంతో గత రెండేళ్లుగా ఈ జిల్లాలో పోస్టల్ సేవలు నిలిచిపోయాయి. లేఖలు, పార్శిళ్లు, ఇతర సరుకుల డెలివరీ స్తంభించిపోయింది. అయితే మణిపూర్ గత ఎనిమిది నెలలుగా రాష్ట్రపతి పాలనలో ఉంది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో క్రమంగా శాంతియుత వాతావరణం నెలకొంటున్నది.

## బస్సుల మధ్య ఇరుక్కుని నుజ్జయిన కారు.. ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గాయాలు



నల్లగొండ: నల్లగొండ జిల్లా చిట్యాల వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు ప్రైవేటు బస్సుల మధ్య కారు ఇరుక్కుపోవడంతో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నందిగామకు చెందిన గుర్రె జోష్ కుమార్, పైల మురళితో పాటు హైదరాబాద్ కొండాపూర్‌కు చెందిన చల్లా శ్రీహర్ష ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. ముగ్గురు కలిసి ఆదివారం తెల్లవారుజామున కారులో నందిగామ నుంచి హైదరాబాద్‌కి బయలుదేరారు. క్రమంలో చిట్యాలకు చేరుకున్న సమయంలో కల్వర్టు వద్ద ముందు వెళ్తున్న ప్రైవేట్ బస్సు అకస్మాత్తుగా ఆగింది. దీంతో వెనుక ఉన్న కారు కూడా ఆగింది. అయితే అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో ప్రైవేటు బస్సు కారును వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో రెండు బస్సుల మధ్య కారు ఇరుక్కుని నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న శ్రీహర్ష తలకు బలమైన గాయాలు కాగా.. జోష్ కుమార్‌కి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను కారులో నుంచి బయటకు తీసి నార్కట్‌పల్లిలోని కామినేని దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీహర్షను హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గూడూరు పట్టణ అభివృద్ధికి సహకరించాలి

**- మంత్రి నారాయణకు జనసేన నాయకులు**

**తీగల చంద్రశేఖర రావు వినతి**



**నెల్లూరు బ్యూరో ( ప్రశ్న న్యూస్)** గూడూరు మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్లు, పబ్లిక్ హెల్త్ విభాగంలో ఫుడ్ ఇన్స్పెక్టర్, శానిటరీ



ఇన్స్పెక్టర్ నియమించాలని జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖరరావు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణకు విన్నవించారు.గూడూరు పురపాలక సంఘ కార్యాలయంలో ఆదివారం అమృత్ పథకం పై సమీక్ష సమావేశంకు విచ్చేసిన మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను జనసేన పార్టీ నాయకులు కలసి మున్సిపల్ పరిధిలోని సమస్యలను పరిష్కరించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో సిబ్బంది లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అలాగే పట్టణంలో నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు, పట్టణం సుందరీకరణలో భాగంగా గూడూరు చెరువు వద్ద వాకింగ్ ట్రాక్, డివైడర్ల మధ్య బ్యూటిఫికేషన్ ఏర్పాటు చేసి పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అందుకు మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించారు. అనంతరం మంత్రి నారాయణను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మోహన్, నాగార్జున, విజయ్, సాయికిరణ్,వంశీ, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సత్యం నేతృత్వంలో ప్రజా సేవకు సిద్ధం

**- బీ ఫారం కోసం దరఖాస్తు చేసిన**

**కాంగ్రెస్ ఎంపీటీసీ అభ్యర్థి : ల్యాగల పద్మ - దేవయ్య**





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం,మల్లాపూర్ గ్రామానికి చెందిన ఎస్సీ-మహిళా కేటగిరీ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీటీసీ అభ్యర్థిగా( ఎస్సీ-మహిళ) ల్యాగల పద్మ - దేవయ్య ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీ ఫారం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా ల్యాగల పద్మ దేవయ్య మాట్లాడుతూ"చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాలను అనుసరిస్తూ, మల్లాపూర్ ఎంపీటీసీ పరిధిలోని గ్రామాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తాను. సామాన్యుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించడం నా ధ్యేయం. మల్లాపూర్ గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తాను," అని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ప్రజల మనసుల్లో నిలిచిన పార్టీ. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా సేవ చేయడమే నా సంకల్పం," అని పేర్కొన్నారు.

# ఘనంగా కృప- సూర్యతేజ దంపతుల రిషిప్షన్ వేడుకలు

**- నగర ప్రముఖుల హాజరు - నూతన దంపతులకు ఆశీర్వాదాలు**





**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 38 వ డివిజన్,సంతోష్ నగర్ కు చెందిన ప్రముఖ బిల్డర్ గుడిసె శంకర్ - అమృత దంపతుల ద్వితీయ కుమార్తె కృప - సూర్యతేజ నూతన దంపతుల వివాహ రిషిప్షన్ (విందు) వేడుకలు ఆదివారం మల్కాపూర్ రోడ్,సప్తగిరి ఫంక్షన్ హాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకలకు అతిథులుగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "వివాహం అనేది రెండు కుటుంబాలను కలిపే పవిత్ర బంధం. కృప - సూర్యతేజ దంపతులు పరస్పర ప్రేమాభిమానాలతో, సుస్థిర కుటుంబ జీవితం గడపాలని కోరుకుంటున్నాం"అని "గుడిసె వారి కుటుంబంలో జరుగుతున్న ఈ సంతోష వేడుకకు మేమందరం హాజరవ్వడం ఆనందంగా ఉంది" అన్నారు.ఈ రిసెప్షన్ వేడుకలకు నగరంలోని రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, కాంట్రాక్టర్లు, బిల్డర్స్, స్నేహితులు, బంధువులు, అభిమానులు భారీగా హాజరై కృప- సూర్యతేజ నూతన దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు.

# నాగారం మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం



నాగారం( ప్రశ్న న్యూస్) నాగారం మున్సిపల్ పరిధిలోని మల్లికార్జున నగర్ కాలనీ, రాజ్ శుక్ నగర్ కాలనీ వాసుల పిలుపుమేరకు కాలనీలు సందర్శించి రోడ్లు, డ్రైనేజ్ సమస్యలు తెలుసుకున్న నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాకు తెలిపిన రోడ్లు, డ్రైనేజీ సమస్యలను త్వరలోనే పరిష్కారం చూపుతామని కాలనీవాసులకు తెలిపారు. నాగారం మునిసిపల్ పరిధిలో గతంలో గెలిచిన నాయకులు చేయని పనులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి నాగారం మున్సిపల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులు ఇప్పటికే చేపట్టామని మరికొన్ని అభివృద్ధి పనులు చేపడుతామని కాలనీ వాసులు తెలిపిన సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని ఆయన నాగారం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గత పాలకులు ఐదు సంవత్సరాలు కాలం గడిపారు తప్ప అభివృద్ధి పనులు చేయడంలో నిర్లక్ష్యం వహించారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వాటికి సంబంధించిన నిధులు ప్రభుత్వం కేటాయిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జే దాసు గారు, వేణుగోపాలరావు గారు, సంజయ్ గారు, బిక్షపతి గారు, తిరుపతయ్య గారు, కాలనీవాసులు పాల్గొనడం జరిగింది.

# ప్రపంచ మేధావి అంబేద్కర్ దేశ ప్రజలకు అత్యంత విలువైన ఓటు హక్కు

**- బోడుప్పల్లో 346వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల**

**- రాజకీయ పార్టీలు నిరుపేదలకు, నిజాయితీపరులకు సీట్లు ఇవ్వాలి**

**- బడుగు, బలహీన వర్గాలు రాజకీయ రంగంలో రాణించాలి**

**- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,నత్తి మైసయ్య**




నాగారం(ప్రశ్న న్యూస్) బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 346వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి నివాళు లర్పించాలి. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు ఆయా రిజర్వేషన్లను అనుసరిస్తూ నిరుపేదలకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, అప్పుడే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి చేసిన రిజర్వేషన్లకు న్యాయం జరుగుతుందని, బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. అదేవిధంగా అంబేద్కర్ కల్పించిన ఓటు అనే ఆయుధాన్ని నిస్వార్ధంగా ప్రజాసేవ చేసే నాయకులను మాత్రమే ఓటు వేయాలని, నేడు రాజకీయమంటే ఒక వ్యాపారంలా చూస్తున్నా పార్టీలను, నాయకులను, పక్కన పెట్టాలని, రాజకీయ నాయకుల ప్రలోభాలకు తలొగకుండా నిజాయితీగల నాయకులను ఎన్నుకోవడానికి మాత్రమే ఓటు హక్కును వినియోగించాలని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో రొయ్య లక్ష్మీనారాయణ, రాపోలు శ్రీరాములు, బండారి సాయి, చిల్ల అంజయ్య, యేసు రాజు, సగ్గు నరసింహ, జడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

**జిల్లా కలెక్టర్ : ఎం. హరిత**



వేములవాడ/ సిరిసిల్ల (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం. హరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు.ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని వెల్లడించారు.

# అంబర్ పేట బిడ్డ కు అమెరికాకు చెందిన యూనివర్సిటీ నుండి ఆగ్రాలో డాక్టరేట్ బిరుదు




అంబర్ పేట(ప్రశ్న న్యూస్) అంబర్ పేట్ పటేల్ నగర్ కు చెందిన ప్రముఖ భరతనాట్య గురువు కూన ప్రియదర్శిని కి ఆగ్రా లోని రాడిసన్ హొటల్లో అమెరికాకు చెందిన జార్జియా డిజిటల్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ మరియు ప్రభుత్వ రంగ సంస్థ నీతి ఆయోగ్ ద్వార భరతనాట్య విభాగం లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుని సిని నటి మరియు విఖ్యాత భరతనాట్య కళాకారిణి సుధా చంద్రన్ చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగింది. ఈ పురస్కారాలు తీసుకున్నందుకు కారకులైన తన గురువులకు మరియు తల్లిదండ్రులకు డాక్టర్ కూన ప్రియదర్శిని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టర్ సిరాజ్, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులను తలపిస్తున్న రోడ్లు.. పెద్దపల్లి పట్టణ 30వ వార్డుకు వెళ్తే అంతే..!



పెద్దపల్లి కమాన్: పెద్దపల్లి మున్సిపల్ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం పట్టణంలోని 30వ వార్డు ప్రజలకు శాపంగా పరిణమించింది. వర్షపు నీరు రోడ్డుపైనే నిలుస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే కాలనీలోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. కనీసం కాలి నడకన కూడా వెళ్లలేకపోతున్నామని ప్రజలు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు.పెద్దపల్లి పోలీస్ స్టేషన్ ముందు మూన్ ఫంక్షన్ హాల్ వీధిలో వర్షం పడినప్పుడల్లా మోకాళ్లలోతు నీళ్లు నిలుస్తున్నాయి. డ్రైనేజీ పొంగిపొర్లుతూ ఇండ్లు, షాపుల్లోకి మురుగు నీరు చేరుతూ దుర్వాసన వస్తున్నదని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఈ రోడ్డు ఇలా మారడానికి కారణం ఇటీవల జెండా చౌరస్తా నుంచి నెహ్రూ విగ్రహం వరకు విస్తరించిన రోడ్డు పనులేనని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఎత్తు పల్లాలను సరిచూసుకోకుండానే ఇష్టారీతిలో అస్తవ్యస్తంగా తారురోడ్డు వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఎస్బీఐ, యూనియన్, ఇండియన్ బ్యాంకులతోపాటు మూన్ ఫంక్షన్ హాల్ వీధిలో వర్షపు నీటితోపాటు డ్రైనేజీలోని మురుగు రోడ్లపై ప్రవహిస్తున్నదని ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డు పై నిలువకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# విశాఖ బీచ్‌లో కొట్టుకుపోయిన ఇద్దరు విదేశీయులు!



వివరాల్లోకి వెళ్తే.. ఇటలీ నుంచి ఇండియా పర్యటనకు 16 మంది యాత్రికులు వచ్చారు. ఈ క్రమంలోనే ఆదివారం నాడు వారు వైజాగ్‌కు వచ్చారు. యారాడ బీచ్‌లో సేద తీరుతున్న సమయంలో అలల తాకిడికి ఇద్దరు సముద్రంలోకి కొట్టుకుపోయారు. ఎప్పటికప్పుడు అలల వేగాన్ని అంచనా వేయకపోవడంతో వారిని ఒక్కసారిగా అలలు లోపలికి లాక్కుపోయాయి. అయితే వారి కేకలు విన్న స్థానికులు వెంటనే లైఫ్ గార్డ్స్‌కు సమాచారం అందించారు. కొట్టుకుపోతున్న ఇద్దరిని రక్షించేందుకు ప్రయత్నించారు. వీరిలో ఒకరు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.

# యువకుడిని బలి తీసుకున్న డెంగ్యూ ఫీవర్



డెంగ్యూతో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన చిన్న శంకరంపేట మండలం ఎస్ కొండాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. చిన్న శంకరంపేట మండలం ఎస్ కొండాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి శ్యామ్-పుష్పలత దంపతుల కుమారుడు కుమ్మరి ప్రభాస్ (20) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. పది రోజుల క్రితం ప్రభాస్ అనారోగ్యానికి గురయ్యాడు. అక్కడి నుంచి ఇంటికి వచ్చి మెదక్‌లోని ప్రైవేట్ దవాఖానలో వైద్య పరీక్షలు చేయించుకోగా డెంగీ వ్యాధిగా నిర్ధారణ అయింది. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించాలని సూచించడంతో నాలుగు రోజుల క్రితం సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు. ప్రభాస్ దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉండే ప్రభాస్ ఆకస్మికంగా మృతిచెందడంతో ఎస్ కొండాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చేతికొచ్చిన కొడుకు కండ్ల ముందే విగతజీవిగా మారిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

# రాగల 3 గంటల్లో పిడుగులు పడొచ్చు.. ఏపీ ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక



ఏపీలో పలు జిల్లాల్లో రానున్న మూడు గంటల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. విజయనగరం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, కోనసీమ,గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కొన్నిప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగతా జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. పిడుగులతో కూడిన వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. చెట్ల కింద ఉండకూడదని హెచ్చరించారు.మరోవైపు ఆదివారం సాయంత్రం 5 గంటలకు కోనసీమ(జి) ముమ్మిడివరంలో 79.7మిమీ, పల్నాడు(జి) గుట్లపల్లిలో 60మిమీ, నెల్లూరు(జి) జలదంకిలో 33.5మిమీ వర్షపాతం నమోదైంది.

# హిందుత్వం జీవన విధానం విశ్వశాంతికి జీవన ఆధారం

- వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం
- ఆర్ ఎస్ ఎస్ కరినగర మండల ఏక్ ప్రభారి
- జక్కుల సత్యనారాయణ మూర్తి



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా ఆర్ ఎస్ ఎస్ వేములవాడ ఖండ ఆధ్వర్యంలో వేములవాడ పట్టణ పురవీధుల గుండా



ఆర్.ఎస్.ఎస్.కార్యకర్తల పథసంచలన్ జరిగింది.అనంతరం స్థానిక పద్మశాలి సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన వక్తగా విచ్చేసిన విశ్రాంత ఉపాధ్యాయులు,ఆర్ఎస్ఎస్ కరినగర మండల ఏక్ ప్రభారి జక్కుల సత్యనారాయణ మూర్తి పాల్గొని ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"1925లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తుందని,హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘం పెంపొందిస్తుందని పేర్కొన్నారు.హిందుత్వం జీవన విధానం,విశ్వశాంతికి ఆధారం,ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి కొరకు హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. సామాజిక సమరసత ,కుటుంబ జీవన విలువలు, స్వ ఆధారిత జీవనం మరియు పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు ప్రతి ఒక్కరి కుటుంబంలో పాటించబడాలని అన్నారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జనజాగరణ చేపట్టబోతుందని తెలిపారు".ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ, పరిసర గ్రామాల స్వయం సేవకులు, వివిధ సంఘ క్షేత్రాల కార్యకర్తలు పాల్గొన్నారని ఖండ కార్యవాహ కొండం పుల్లారెడ్డి తెలిపారు.

# బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోండి

- ఎస్‌బీఐ మేనేజర్ చందులాల్

దేశబోయిన శ్రీనివాస్ కుటుంబానికి 10లక్షల బీమా చెక్కు అందజేత




**కొత్తగూడెం (ప్రశ్న న్యూస్)** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యానగర్ బ్రాంచ్ ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ చందులాల్ అన్నారు. విద్యానగర్ కాలనిలో ఓ ప్రయివేట్ స్కూల్ బస్ క్లీనర్ గా పనిచేస్తున్న దేశబోయిన శ్రీనివాస్ విద్యానగర్ ఎస్బిఐ బ్రాంచ్ లో యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నారు. అనుకోకుండా జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను మృతి చెందగా నామీనిగా ఉన్న శ్రీనివాస్ భార్య రాజకుమారి కి రూ.10లక్షల బీమా చెక్కును ఏజీఎం సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎస్బిఐ బ్యాంక్ అత్యుత్తమ ఇన్సూరెన్స్ కవరేజ్ ఇస్తుందని ఆపద ఎటువంటి రూపంలో వస్తుందో తెలియని పరిస్థితి కాబట్టి ముందు జాగ్రత్తగా ఇన్సూరెన్స్ తీసుకుంటే కుటుంబానికి ఉపయోగపడతాయని ప్రజలు ఇన్సూరెన్స్, పాలసీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ తిరుమలేష్, క్యాష్ ఆఫీసర్ ఇందిరా, అసోసియేట్ కోటేశ్వరి, మరియు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాల్కపూర్ దుర్గమాత సేవా సమితి నూతన కమిటీ ఎన్నిక



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని మాల్కపూర్ గ్రామంలో ఆదివారం "శ్రీ దుర్గమాత సేవా సమితి" కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలో అధ్యక్షులుగా బొంగోని ప్రసాద్, ఉపాధ్యక్షులుగా చాంద్, కోశాధికారిగా గుంటుకు బాలక్రిష్ణ, ప్రధాన కార్యదర్శిగా జాగిరి వేణు,కార్యదర్శిగా ఎడపల్లి ధర్మేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు భక్తుల సేవలో తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. గ్రామ పెద్దలు, భక్తులు కొత్త కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

# బీసీలపై బీసీలతో దాడి చేయిస్తోండ్లు...

- రాజకీయ పార్టీలను భయపెట్టేలా కుల సంఘాలు ఉండాలే
- మంథనిని అర్థం చేసుకుంటే బీసీ రిజర్వేషన్‌లు సునాయసమే

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**మంథని ( ప్రశ్న న్యూస్)** బీసీలపై బీసీలతో దాడి చేయించే సంస్కృతి హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతూనే ఉందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. హైద్రాబాద్ లక్డికాపూల్ లోని అశోక హోటల్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఎంపీ ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో స్థానిక సంస్థలలో బీసీలకు 42% రిజర్వేషన్లు సాధన మరియు చట్ట సభలలో బీసీలకు 50% రిజర్వేషన్లకై ఏర్పాటు చేసిన "బీసీ ప్రజా ప్రతినిధుల, వివిధ కులసంఘాల అఖిల పక్ష సమావేశంలో ఆయన పాల్గొని, బీసీ రిజర్వేషన్ల ఆవశ్యకతపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక బీసీ బిడ్డగా తాను పోరాటం చేస్తుంటే తనపై అనేక దాడులకు పాల్పడుతున్నారని, హైదరాబాద్ నుంచి హన్మంతరావు, దానం నాగేందర్, అద్దంకి దయాకర్, భట్టి విక్రమార్క, మందకృష్ణ మాదిగ లాంటి నాయకులు వచ్చి తనపై పోరాటం చేశారన్నారు.ఎవరో చెప్పిన మాటలు నమ్మి మన బీసీలపైనే పోరాటం చేస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.హైదరాబాద్ నుంచి పెద్ద పెద్ద నాయకులు వచ్చిన కేసు ఇప్పటికి బయటపడలేదన్నారు. అయితే పూలే లాంటి మహనీయుడిని అర్థం చేసుకోకపోవడం మూలంగానే ఇన్ని అనర్థాలు జరుగుతున్నాయన్నారు. మంథనిని అర్థం చేసుకుంటే బీసీ రిజర్వేషన్‌లు సాధించడం సునాయసమవుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆనాడు పూలేను గురువుగా స్వీకరించిన డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ అర్థం చేసుకున్నారని, ఆ తర్వాత ఎస్సీలకు పూలే, అంబేద్కర్ అర్థం అయ్యాడే కానీ బీసీలకు అర్థం కాలేదన్నారు. పూలేను అర్థం చేసుకున్న అంబేద్కర్‌ను బీసీలకు దూరం చేసిన చరిత్ర అగ్రవర్ణాలదేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. పదేండ్లుగా మంథని నియోజకవర్గంలో మహనీయులను అర్థం చేసే విధంగా ప్రయత్నాలు చేస్తుంటే కేవలం పదిశాతం మాత్రమే సాధ్యమయిందని బావిస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే కుల సంఘాల మీటింగ్‌లకు రాజకీయ నాయకులను ఆహ్వానించకూడదని, వారివారి ఏజెండాలు వాళ్లకు ఉండటం మూలంగా ఫలితం ఉండదన్నారు. పార్టీలకు భయం పుట్టించే స్థాయిలో కుల సంఘాలు ఉండాలని, అలాంటప్పుడే ఏదైనా సాధించుకోవచ్చన్నారు. రాజకీయ నాయకుల మెడలు వంచి పని చేయించుకోవాలని ఆయన ఈసందర్భంగా స్పష్టం చేశారు.

# చొప్పదండి ఎమ్మెల్యే సత్యం నాయకత్వంలో గెలుపే లక్ష్యం దిశగా కృషి చేస్తాం

- బోయినిపల్లి మండలంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురుతుంది
- కాంగ్రెస్ పార్టీ నేతలు : ముదుగంటి సురేందర్ రెడ్డి, వన్నెల రమణారెడ్డి
- 11 ఎంపీటీసీ స్థానాలకు ఔత్సాహిక అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరణ



**బోయినపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని 11 అన్ని ఎంపీటీసీ స్థానాలు, జడ్పీటీసీ స్థానంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయం అని మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి,మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి ప్రకటించారు.ఆదివారం మండల కేంద్రంలోని చెన్నాడి రాధమ్మ ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక కోసం ఆసక్తి ఉన్న కార్యకర్తలు, అభిమానుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు గాను ఇప్పటివరకు 60 దరఖాస్తులు అందాయని, మరో రెండు రోజులపాటు దరఖాస్తులు స్వీకరిస్తామని నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో బోయినిపల్లి మండలంలో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అహర్నిశలు శ్రమించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎమ్మెల్యే సత్యం ముందుండి పరిష్కరిస్తారని,ఆయన నాయకత్వంలో మండలంలో 23 గ్రామాలకు 5 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ,ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు,ఉచిత 200 యూనిట్ల కరెంటు,సన్నబియ్యం,రైతు రుణమాఫీ,రూ.500 వంటగ్యాస్,తొమ్మిది రోజులలోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా పథకాలు అమలు చేయడం కాంగ్రెస్ పార్టీ ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి,సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీం రెడ్డి మహేశ్వర్ రెడ్డి, జిల్లా నాయకులు జంగం అంజయ్య, ఏనుగుల కనకయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్, కాంగ్రెస్ నేతలు సంబ లచ్చయ్య, అక్కెనపల్లి ఉపేందర్, సువీన్ యాదవ్, గుంటి జలంధర్, నరేష్, సత్యనారాయణ రెడ్డి, వెంకటేష్, మోహన్, మహేందర్, హరికృష్ణ, రాజేష్, సతీశ్, మెరుపుల మహేష్, భరత్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రాజిరెడ్డి, తిరుపతి రెడ్డి, ప్రశాంత్, సత్తయ్య, సురేందర్ రెడ్డి, అంజయ్య, నాగుల వంశీ, ఏనుగుల అనిల్, వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి ,మోహన్, దేవయ్య, భాస్కర్ రెడ్డి, సంపత్, నజీర్, ఎండి మహమ్మద్, నక్క శ్రీకాంత్, జంగ సత్యం, ప్రదీప్, జోగు రవీందర్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సేవలో జిల్లా ఎస్పీ మహేష్ బీ గితే



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ శ్రీపార్వతి రాజరాజేశ్వర స్వామివారిని రాజన్న సిరిసిల్ల జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) మహేష్ బీ గితే ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనం అనంతరం కళ్యాణ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రం కప్పి లడ్డూ ప్రసాదాలు అందజేసి,వేదోక్త ఆశీర్వచనం చేశారు.

# మానవత్వం చాటుకున్న కుంటాల నవీన్ కుమార్, కుంటాల అనిల్ కుమార్



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** టీ తాగడానికి వెళ్లిన అన్నదమ్ములకు రెండున్నర తులాల బంగారు గొలుసు దొరికిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని బాసురేగడి గ్రామంలో నివాసముంటున్న కుంటాల నవీన్ కుమార్, కుంటాల అనిల్ కుమార్ లు ఆదివారం సాయంత్రం వారు నివాసం ఉంటున్న గ్రామం నుంచి గండిమైసమ్మ గ్రామ సమీపంలో ఉన్న పిస్తాహౌస్ లో చాయ్ తాగి తిరిగి వస్తున్న సమయంలో వారికి రెండున్నర తులాల బంగారు గొలుసు దొరికింది. ఈ విషయాన్ని గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారేపల్లి సుధాకర్ కు తెలియజేయగా మారేపల్లి సుధాకర్ సహకారంతో కుంటాల నవీన్ కుమార్, కుంటాల అనిల్ కుమార్ లు దుండిగల్ పోలీస్ స్టేషన్ కి వెళ్లి స్టేషన్లో విధులలో ఉన్న సబ్ ఇన్స్పెక్టర్ రంజిత్ రెడ్డికి బంగారు గొలుసును అందజేశారు. అనంతరం సబ్ ఇన్స్పెక్టర్ రంజిత్ రెడ్డి గొలుసు పోగొట్టుకున్న వారిని పిలిపించి రెండున్నర తులాల బంగారు గొలుసును అందజేశారు. మానవతా దృక్పథంతో దొరికిన రెండున్నర తులాల బంగారు గొలుసును పోలీసులకు అప్పగించి మానవత్వం చాటుకున్న కుంటాల నవీన్ కుమార్, కుంటాల అనిల్ కుమార్ లను సబ్ ఇన్స్పెక్టర్ రంజిత్ రెడ్డి తో పాటు సిబ్బంది అభినందించారు.

# నూతనకల్ గ్రామంలో విజయవంతంగా ముగిసిన టోర్నమెంట్

బెస్ట్ బ్యాటర్ అవార్డు అందుకున్న కుమ్మరి సాయి




**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని నూతనకల్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ క్రికెట్ టోర్నమెంట్ లో మొత్తం ఆరు జట్లు పాల్గొనగా ఫైనల్ లో స్మాషర్స్, స్టిల్ కామెండర్స్ జట్లు



తలపడగ రాము సారధ్యంలో స్టీల్ కమాండర్స్ జట్టు ఫైనల్ విజేతగా గెలుపొందింది. ఫైనల్లో అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన నందుకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. బ్యాటింగ్ లో అద్భుతంగా రాణించిన కుమ్మరి సాయికి బెస్ట్ బ్యాటర్ అవార్డు, నవీన్ కుమార్ కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు, చిన్నోళ్ల అక్షయ్ లకు బెస్ట్ బౌలర్ అవార్డులు అందుకున్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వహించడానికి ముందుకు వచ్చిన స్పాన్సర్లు మంగలి శ్రీనాథ్, వడ్ల సాయికుమార్, మధు యాదవ్ లు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో తోడ్పడతాయని, యువత నేడు మొబైల్ ఫోన్ల వాడకం వల్ల క్రీడలలో రాణించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ యువకులు పాల్గొన్నారు.

# చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శ



**కొడిమ్యాల (ప్రశ్న న్యూస్)** జగిత్యాల జిల్లా,కొడిమ్యాల మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చల్ల బాపిరెడ్డి తండ్రి గత వారం రోజుల క్రితం మృతి చెందిన నేపథ్యంలో ఆదివారం చొప్పదండి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సంతాప సానుభూతిని తెలిపారు.అనంతరం నమిలికొండ గ్రామానికి చెందిన ఒక బాలుడు 20 రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో గాయపడినట్లు తెలుసుకున్న సుంకె రవిశంకర్ స్వయంగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, అవసరమైన సహాయం అందిస్తానని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి,బండపల్లి అంజన్ కుమార్,ప్యాట అంజి, శివప్రసాద్,కృష్ణస్వామి, కనకయ్య,నవీన్ రెడ్డి తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## హైప్ పెంచుతోన్న రవితేజ, శ్రీలీల మాస్ జాతర పోస్టర్



టాలీవుడ్ యాక్టర్ రవితేజ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం మాస్ జాతర. సామజవరగమన ఫేం రైటర్ భాను బొగవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ రవితేజ 75 గా వస్తోంది. ఈ మూవీ అక్టోబర్ 31న గ్రాండ్‌గా విడుదలవుతుందని ఇప్పటికే మేకర్స్ ప్రకటించారని తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు.

## ఆ సినిమాకు నా హృదయంలో ప్రత్యేక స్థానం..

### తెలుగు మూవీపై కయాదు లోహర్



డ్రాగన్ సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కయాదు లోహర్. ఈ అస్సామీ సుందరి నెట్టింట పోస్ట్ పెట్టిందంటే చాలు కామెంట్స్, లైకుల వర్షం కురుస్తుంది. ఈ బ్యూటీ తాజాగా చెన్నైలో జరిగిన ఓ అవార్డ్స్ ఈవెంట్ సెర్మనీలో పాల్గొంది. ఈ సందర్భంగా తనకు బాగా ఇష్టమైన, స్ఫూర్తిని కలిగించే సినిమా ఏంటో చెప్పింది కయాదు లోహర్. ఇంతకీ ఆ సినిమా ఏంటనుకుంటున్నారా..? బాక్సాఫీస్‌ను షేక్ చేసిన కల్ట్ క్లాసిక్ ఏ మాయ చేశావే.తాను ఏ మాయ చేశావే తెలుగు, తమిళ వెర్షన్లకు వీరాభిమానినని.. మనస్సును కదిలించే స్టోరీ టెల్లింగ్ చాలా మందికి ప్రేరణ కలిగించేలా ఈ రొమాంటిక్ డ్రామా సాగుతుందని చెప్పింది కయాదు లోహర్. ఈ చిత్రానికి తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుందని చెప్పుకొచ్చింది. ఈ సినిమాలో త్రిష, శింబు (తమిళ వెర్షన్)లో అద్భుతంగా ఉంటుందని.. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ ఆల్బమ్ ఆల్‌టైమ్ ఫేవరేట్ హిట్ లిస్టులో ఉంటుందని చెప్పుకొచ్చింది. కయాదు లోహర్ ప్రస్తుతం తమిళంలో మూడు, మలయాళంలో ఒక సినిమా చేస్తుంది.



## జాక్వెలిన్ ఫెర్నాండేజ్ అందం చూడతరమా.. ఫ్యాషన్ వీక్‌లో మెరుపులు

**గ్లామరస్ రోల్స్‌తోపాటు నటనకు ఆస్కారమున్న పాత్రలు చేస్తూ ఇండియావైడ్‌గా సూపర్ క్రేజ్ సంపాదించుకున్న భామల్లో ఒకరు జాక్వెలిన్ ఫెర్నాండేజ్ . ఎప్పటికప్పుడు కొత్త కొత్త లుక్స్‌లో కనిపిస్తూ సోషల్ మీడియాను షేక్ చేస్తుంటుంది.**

## హై ఓల్టేజ్ మారియో

అనిరుధ్, హెబ్బాపటేల్ జంటగా రూపొందుతున్న యాక్షన్ ప్యాక్డ్ ట్విస్టెలిష్ ఎంటైర్టైనర్ 'మారియో'. 'ఏ టర్బో చార్జ్‌డ్ ర్యాంప్ రైడ్' అనేది ఉపశీర్షిక. సిల్వర్ స్క్రీన్ ప్రొడక్షన్స్, రిజ్వాన్ ఎంటర్‌టైన్మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి కల్యాణ్ జీ గోగణ దర్శకుడు. దసరా పర్వదినం సందర్భంగా ఈ సినిమా పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు.




## ఓ చెలియా..

### ఓ గాఢమైన ప్రేమకథ



నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్న ప్రేమకథాచిత్రం 'ఓ చెలియా..'. ఎం.నాగరాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. రూపాశ్రీ కొపురు నిర్మాత. నిర్మాణంలో ఉన్న ఈ సినిమా త్వరలో విడుదల కానున్నది. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు. ప్రచారంలో భాగంగా ఈ సినిమా నుంచి మరో మెలొడీని మేకర్స్ విడుదల చేశారు.

## యూట్యూబ్‌లో అదరగొడుతున్న 'ఏమి మాయ ప్రేమలోన' మ్యూజిక్ ఆల్బమ్

అకీ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై రూపొందిన 'ఏమి మాయ ప్రేమలోన' అనే మ్యూజిక్ ఆల్బమ్‌కు యూట్యూబ్‌లో అద్భుతమైన ఆదరణ లభిస్తోంది. దసరా కానుకగా విడుదలైన ఈ సాంగ్ భారీ వ్యూస్‌ను సాధిస్తూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఆల్బమ్‌లో అనిల్ ఇనుమడుగు హీరోగా నటించగా, వేణి రావ్ హీరోయిన్‌గా నటించింది. ముఖ్యంగా, అనిల్ ఇనుమడుగు ఇందులో కథానాయకుడిగా నటించడంతో పాటు, ఈ పాటకు సాహిత్యం (లిరిక్స్) అందించడం మరియు దర్శకత్వం వహించడం విశేషం. మార్క్ ప్రశాంత్ అందించిన సంగీతం, దిన్కర్ కలవుల మరియు దివ్య ఐశ్వర్య గానం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి.




## బాలీవుడ్‌పై రాశి ఖన్నా సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి రాశి ఖన్నా దక్షిణాది, ఉత్తరాది సినీ పరిశ్రమల పనితీరుపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తన కొత్త చిత్రం 'తెలుసు కదా' ప్రమోషన్లలో భాగంగా మాట్లాడిన ఆమె, తెలుగు చిత్ర పరిశ్రమ పని వాతావరణాన్ని ప్రశంసిస్తూ, బాలీవుడ్‌పై కొన్ని ఆసక్తికరమైన అభిప్రాయాలను పంచుకున్నారు. పని గంటల విషయంలో తెలుగు పరిశ్రమ ఎంతో మెరుగ్గా ఉంటుందని రాశి ఖన్నా తెలిపారు. "తెలుగులో రోజుకు సగటున 9 గంటలు మాత్రమే షూటింగ్ ఉంటుంది. కానీ, తమిళ, హిందీ పరిశ్రమల్లో 12 గంటల సుదీర్ఘ షిఫ్టుల వల్ల నటీనటులు ఎక్కువగా అలసిపోతారు" అని ఆమె వివరించారు. ఈ తేడా పనితీరుపై గణనీయమైన ప్రభావం చూపుతుందని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, నటీనటుల ప్రవర్తనలో కూడా దక్షిణాది, ఉత్తరాది పరిశ్రమల మధ్య స్పష్టమైన తేడా కనిపిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. "సౌత్ ఇండస్ట్రీలోని నటీనటులు చాలా ప్రైవేట్‌గా ఉంటూ, పని పట్ల ఎక్కువ అంకితభావంతో ఉంటారు. వారిలో గౌరవం, విధేయత కనిపిస్తాయి. కానీ బాలీవుడ్‌లో నటులు కొంచెం ఆడంబరంగా, హడావిడిగా ప్రవర్తిస్తారు. వారి నుంచి దక్షిణాది నటులు నేర్చుకోవాల్సింది ఏమీ లేదు, కానీ వాళ్లే దక్షిణాది పరిశ్రమను చూసి కొన్ని విషయాలు నేర్చుకోవాలి" అని రాశి ఖన్నా వ్యాఖ్యానించారు. అయితే, ఆమె వ్యాఖ్యలపై కొందరు నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. బాలీవుడ్‌లో అవకాశాలు తక్కువగా రావడం వల్లే ఆమె ఉత్తరాది పరిశ్రమను తక్కువ చేసి మాట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు. ఈ విమర్శలపై స్పందించిన రాశి ఖన్నా, తాను ఎవరినీ కించపరిచే ఉద్దేశంతో మాట్లాడలేదని, కేవలం వివిధ పరిశ్రమలలో పనిచేసినప్పుడు తనకు ఎదురైన అనుభవాలను మాత్రమే పంచుకున్నానని స్పష్టం చేశారు.



## జూలూరుపాడు జడ్పీటీసీ రెబల్ గా పోటీ చేస్తా..!!

**- సీనియర్ కాంగ్రెస్ నేత కొలిపాక వెంకటేశ్వర్లు.**



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 05: జూలూరుపాడు జడ్పీటీసీ అభ్యర్థి ప్రకటన సెగలు రేపుతుంది. కొంతమంది సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ మీద గుర్రుగా ఉన్నారు. తమ ఆవేదనను మీడియా ద్వారా వెల్లగక్కారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టాన పరిశీలనకు జడ్పీటీసీ సభ్యుల జాబితాలో తమ పేరు పంపక పోవడంతో అసంతృప్తి తీవ్ర స్థాయికిచేరింది. ఇప్పటికే పలువురు నేతలు తమ మద్దతుదారులు. కార్యకర్తలతో చర్చలతో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో జడ్పీటీసీ జాబితాలో తమ పేరులేని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో జూలూరుపాడు జడ్పీటీసీ కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తానని కొలిపాక వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఆదివారం పత్రిక విలేకరులతో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో వలస వాదులకు వున్న ప్రాధాన్యత సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని ఒకానొక సమయంలో రాజకీయంగా ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని జూలూరుపాడు మండలంలో కాంగ్రెస్ పార్టీని బ్రతికించిన కుటుంబం మాదని. అధికారం లేకపోయినా పార్టీ కోసమే బ్రతికామని అలాంటి మాకు కాంగ్రెస్ పార్టీలో సమూచిత స్థానం దక్కడం లేదని స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జూలూరుపాడు జడ్పీటీసీ స్థానం బీసీ జనరల్ కు రిజర్వ్ కావడంతో జడ్పీటీసీ గా పోటీ చేసేందుకు సిద్ధంగా వున్నానని ఇప్పటికైనా స్థానిక శాసన సభ్యులు మాళోత్ రాందాస్ నాయక్ సీనియర్ కాంగ్రెస్ నాయకులకు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ప్రాధాన్యత కల్పించాలి, లేని పక్షంలో జూలూరుపాడు జడ్పీటీసీ కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని కొలిపాక వెంకటేశ్వర్లు తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ ఒంటరిగానే పోటీ..!

**- సిపిఐ జిల్లా సమితి సభ్యులు గుండె పిన్ని వెంకటేశ్వర్లు..**



**జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్, 05:** జూలూరుపాడు మండలం, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు గుండె పిన్ని వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడు లో మండల కౌన్సిల్ సమావేశం పొన్నెకంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె పిన్ని మాట్లాడుతు ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండలము లో ప్రజల పక్షాన సిపిఐ నిలబడి పరిష్కారం కోసం పోరాడుతుందని, పార్టీ శ్రేణులు అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు మండలంలో అన్ని ఎంపీటీసీ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని , జెడ్పిటిసి స్థానానికి కూడా పోటీ చేస్తామని తెలిపారు. కలిసొచ్చే పార్టీల పొత్తుల అవగాహనతో ముందుకు వెళ్తామని తెలిపారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలైన సందర్భంగా డిసెంబర్ లో ఖమ్మంలో భారీ సభను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు ఎల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, గుండె పిన్ని మధు, యాస రోశయ్య, వల మల్ల సామేలు, కిలారి ముత్యాలు,గుడిమెట్ల సీతయ్య, తూము కోటయ్య, చిమట ముత్తయ్య, కంపసాటి నాగేశ్వరరావు, కొండా వీరయ్య,బరగడ రమేష్, పాలెపు ప్రభాకర్, చీమకుర్తి సంతోష్, కొండల్ , ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల ఆపద్బాంధవుడు చారుగుళ్ల..!!



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 05:గత 25 సంవత్సరాల పైగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మరియు ఆర్యవైశ్య సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలలో ముందుంటూ నడిపిస్తున్న చారుగుళ్ల శ్రీనివాస్ , వారు జిల్లా అధ్యక్షులుగా ఉన్నప్పుడు ఇచ్చిన మాట ప్రకారం పదవి కాలం ముగిసినప్పటికీ వారి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండటం హర్షణీయం. దీనిలో భాగంగా ఆదివారం జూలూరుపాడు మండలం గుండేపూడి గ్రామ వాస్తవ్యులు మునగాల సాయి కిరణ్ కి, వారు విధులలో చేరేవరకు ప్రతి నెల రూ 1,000 చొప్పున వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ తాజా మాజీ అధ్యక్షులు మరియు వారి టీం ద్వారా ప్రతి నెల అందజేస్తున్నారు. ఈ సేవా కార్యక్రమం లో భాగంగా (33వ) నెల అక్టోబర్ 2025 పెన్షన్ రూ 1,000 వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త కార్యదర్శి మరియాల చంద్రమౌళి గుప్త చేతుల మీదుగా తెలంగాణా రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం ఉపాధ్యక్షులు మహంకాళి గోపాలకృష్ణ మరియు రాష్ట్ర పొలిటికల్ కో చైర్మన్ వందనపు సత్యనారాయణ మరియు జూలూరుపాడు పట్టణ అధ్యక్షులు శ్రీ ఉడతా వేణు గోపాలరావు సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి గుప్త గారు మాట్లాడుతూ పదవిలో ఉన్నా లేకపోయినా శ్రీనివాస్ గారు క్రమం తప్పకుండా ప్రతినెల పెన్షన్ ఇవ్వటంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం భావితరాలకు స్ఫూర్తిదాయకం అని కొనియాడారు ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గం మాజీ చైర్మన్, కో చైర్మన్ ఉడతా నగేష్ కుమార్, సముద్రాల అనిల్ కుమార్ , జూలూరుపాడు మండల ఆర్యవైశ్య సీనియర్ నాయకులు పెండ్యాల కృష్ణమూర్తి, కంచర్ల రామారావు , పెండ్యాల నరేష్ , వేముల నాగేశ్వరరావు, కొదుమూరి కరుణాకర్ , అనుమళ్ల శ్రీనివాస రావు మరియు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరం పై ఆదివాసీ మహిళల దాడి

నార్నూర్ : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం నాగల్ కొండ గోండు గూడ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళలు చెరువు సమీపం వద్ద నాటు సారా తయారీ స్థావరం పై ఆదివారం దాడులు నిర్వహించారు. గుడుంబా తయారీ చేసే సామగ్రిలు వెంట తీసుకొచ్చి పాఠశాల ఆవరణ ముందు ధ్వంసం చేశారు. గతంలోని బెల్టు దుకాణాలలో మద్యం విక్రయాలు.. గుడుంబా తయారిని అరికట్టాలని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యానికి బానిసై తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆరోపించారు.గుడుంబా తయారీ చేసే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాగే పునరావృతం అయితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆదివాసి మహిళలు హెచ్చరించారు. ఈ విషయాన్ని నార్నూర్ ఎస్ఐ అఖిల్ కు సమాచారం ఇవ్వగా గుడుంబా తయారీ స్థావరాలను పరిశీలించారు. వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు.రాథోడ్ శంకర్, రాథోడ్ దన్ను నాటు సారా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. బాధితులపై చట్టారీత్య చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు. నాటు సారా తయారు చేస్తున్నట్లు దృష్టికి వస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ బలాన్ పూర్ మాజీ సర్పంచ్ ఆత్రం పరమేశ్వర్, ఆదివాసీ మహిళలు నీలాబాయి, కవిత, అనసూయ, జమున బాయి, రాధా బాయి తదితరులున్నారు

## కాక గడ్డం వెంకటస్వామి చనిపోయిన

# ప్రజల గుండెల్లో నిలిచిన గొప్ప వ్యక్తి.

**గడ్డం వెంకటస్వామి 96వ జయంతిసందర్భంగా ఘన నివాళులు.**

**పూలమాలవేసి, ఘనంగా (కాక )జయంతిని జరిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**రాష్ట మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఆదేశాల మేరకు.**



**మంథని ప్రశ్న న్యూస్** మంథనిలోని( కాక) వెంకటస్వామి జయంతిని ఉద్దేశించి మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మాజీ ఎంపిపి కొండ శంకర్ మాట్లాడుతూ గడ్డం వెంకటస్వామిని గుడిసెల వెంకటస్వామి అనే వారు అని అన్నారు. 1929 2014 భారత పార్లమెంటు సభ్యుడుగా ఎమ్మెల్యేగా కూడా ఉన్నారు కాకా వెంకటస్వామి ఆంధ్రప్రదేశ్ లోని పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహించారు అని గుర్తు చేశారు.

తొలి తెలంగాణ ఉద్యమంలో పాల్గొని బుల్లెట్ గాయాల పాలవ్వడం జరిగిందని, అయినా వాటిని లెక్కచేయకుండా మలి తెలంగాణ ఉద్యమంలో వారి పాత్ర ప్రత్యేకమైనదని సి డబ్ల్యు సి లో తెలంగాణ గలాన్ని వినిపించినటువంటి గొప్ప వ్యక్తి కాక వెంకటస్వామి అని తెలిపారు. నిజాం నిరంకుశ పాలన పై వ్యతిరేకంగా జరిగినటువంటి పోరాటంలో సైతం వెంకటస్వామి భాగస్వాములైనరని ఈ సందర్భంగా తెలిపారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న సందర్భంలో భూస్వాముల గుండాలు పేదల గుడిసెను తొలగించి కబ్జాకు గురి చేయటానికి ప్రయత్నం చేస్తే వెంకటస్వామి నిరుపేదల తరఫున పోరాడి మళ్లీ వారందరికీ గుడిసెలు వేయించి గుడిసెల వెంకటస్వామి గా పేరు గాంచినరాని తెలిపారు. వెంకటస్వామి యువజన కాంగ్రెస్ ద్వారా రాజకీయాలలో అరంగేయటం చేసి ఎంపీగా, ఎమ్మెల్యేగా, కేంద్రమంత్రిగా సి డబ్ల్యూ సి గా ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా వారు ఈ దేశ ప్రజలకు ఎన్నో సేవలు అందించడం జరిగింది అని వారు గుర్తు చేశారు.కాక వెంకట్ స్వామి కార్మిక నాయకునిగా సింగరేణి నష్టాలలో ఉన్న సందర్భంలో కేంద్రం నుండి 400 కోట్లను తీసుకువచ్చి సింగరేణి లాభాల బాట పట్టే విధంగా వారు కృషి చేయడం జరిగిందని, కార్మికుల సంక్షేమం కోసం ప్రైవేటు కార్మికుల పింఛన్ కోసం వారు పాటుపడడం జరిగిందని, కార్మికుల పిల్లల విద్య కోసం మరియు కార్మికుల ఐటి పన్ను రద్దు కోసం వారు కృషి చేయడం జరిగింది అని అన్నారు.

రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణ కోసం వారు వినలేని కృషి చేయడం జరిగిందని తెలిపారు కాక వెంకట స్వామి శ్రీపాద రావు తో కలిసి ఈ ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఈ సందర్భంగా వారు తెలిపారు ఈ కార్యక్రమంలో మంథని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాదుల శ్రీకాంత్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మంథని రాకేష్, బీసీ సెల్ మండల అధ్యక్షులు అయిలి శ్రీనివాస్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పర్షవేణ మోహన్, ఆరెల్లి కిరణ్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అజీమ్ ఖాన్, అర్థం సదానందం, పేరవేణ లింగయ్య యాదవ్, నూకల బానయ్య, ఆకుల కిరణ్, దాసరి గట్టయ్య, దొరగొర్ల శ్రీనివాస్, జాగిరి సదానందం, ఎరుకల రమేశ్ బాబు, గొల్లపల్లి శ్రీనివాస్, మంథని శ్రీనివాస్, అక్కపక సంపత్, సాగర్, ఎరుకల సురేష్, చంద్రు విజయ్, మంథని సమ్మయ్య, బూడిద రంజిత్, మబ్బు తిరుపతి, రామెపెల్లి నాగరాజు, కోరవేన రవి, కావేటి సందీప్, కొత్త శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఊటవాగుకి రోడ్డు, బ్రిడ్జి నిర్మించాలని

# రైతులు వినూత్న నిరసన..!!

**- పొలాలకు వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడుతున్న అన్నదాతలు..**

**- కలెక్టర్, మంత్రులకు వినతులు అందజేత..**

**- శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు ఆందోళన.**





**తల్లాడ, అక్టోబర్ 5 (ప్రశ్నన్యూస్) :** మండలంలోని మల్లవరం గ్రామంలో పొలాలకు వెళ్లే ఊటవాగుకు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని ఆదివారం ఆ గ్రామ రైతులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలో ఉన్న ఆ ఊటవాగులోకి దిగి ఎలా వెళ్లాలంటూ ప్రశ్నిస్తున్నారు. ఓట్లు కోసం నిత్యం తిరిగే నేతలు రైతుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్రంగా వైఫల్యం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో ప్రధాన సమస్య అయిన ఈ సమస్యను పరిష్కరించేంతవరకు ఓట్లు కూడా వేసేందుకు ముందుకు రామని భీష్మించుకుని కూర్చునే పరిస్థితి నెలకొంది. వివరాలు ప్రకారం.. మల్లవరం గ్రామం నుండి లోల్లూరుగూడెం తో పాటు పరిసర పొలాలకు వెళ్లాలంటే రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ వాగు కింద వందలాది ఎకరాలు సాగు విస్తీర్ణం జరుగుతాయి. అయితే వాగు ఉండటం వల్ల రైతులు అటువైపు వెళ్లేందుకు వాగులో నీరు ఉండటం వల్ల వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది.

అదే కాకుండా మహిళ రైతులు అయితే చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన అనేక మంది రైతులు ఇటీవల జిల్లా కలెక్టర్ అనుదీప్ తో పాటు మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఈ ప్రధాన సమస్యను పరిష్కరించాలని వినతి పత్రాలు అందించారు. అయినా కూడా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మల్లవరం గ్రామ రైతులు ఆ వాగులోకి దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరిస్తేనే ఓట్లు వేస్తామని అంటున్నారు. రైతులకు న్యాయం చేస్తామని చెబుతున్న నేతలు ఈ సమస్యను పరిష్కరించడంలో వెనకడుగు వేస్తున్నారని తెలియజేస్తున్నారు.

ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు కల్పించుకొని ఈ ప్రధాన సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# “కాకా” జయంతి ఉత్సవాలు అంబరాన్ని అంటిన సంబరాలు.

**తెలంగాణ రాష్టంలో కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా కాక.**

**తనదైన ముద్ర వేసుకున్న దేశ , రాష్టాలకు తలమానికమైన వెంకట్ స్వామి( కాక)**

**కాక వెంకటస్వామి. 96వ జయంతి సందర్భంగా మాల బంధువులందరూ ఘనమైన నివాళులర్పించారు.**




**మంథని ( ప్రశ్న న్యూస్)**“ కాకా” రాజకీయ ప్రస్థానం హైదరాబాదులోని ఆర్య సమాజంలో సభ్యత్వం తీసుకొని హైదరాబాద్ కాంగ్రెస్లో రామానంద తీర్థ సమక్షంలో చేరి అంచలంచెలుగా ఎదిగి హైదరాబాదు స్టేట్ యూత్ జనరల్ సెక్రెటరీగా. ఎన్నికయి ఐ ఎన్ టి యు సి లో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గా చేరి హైదరాబాదులో రిక్షా కార్మికులకు బడుగు



బలహీన వర్గాలకు 80 వేల గుడిసెలు వేయించిన మొదటి వ్యక్తి గుడిసెలు వెంకటస్వామిని. పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గా వెలిగి సమాజ శ్రేయస్సుకోసం నిరంతరం పనిచేసిన గొప్ప మహానాయకుడు వెంకటస్వామి. ఈయన నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఒక గొప్ప వ్యక్తి కాక. మొదటిసారి సార్వత్రిక ఎన్నికలలో నామినేషన్ వేసి తగిన వయసు లేదని తిరస్కారనకు గురైన మొదటి వ్యక్తి కూడా కాక. వెంకటస్వామి తదానంతరం సిర్పూర్ కాగజ్నగర్లో 1957లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొంది శాసన చట్ట సభలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కాలుపెట్టిన దళిత నాయకుడు( కాకా) ఆంధ్ర రాయలసీమలోనీ రాజకీయ నాయకులకు తెలంగాణ ఆవశ్యకతను కేంద్రానికి తెలియపరిచిన కాంగ్రెస్ వాది కాక. తదానంతరము రాయలసీమ రెడ్లు, ఆంధ్ర ప్రాంతం, చౌదరిసు నాయు ల్లు ఆంధ్రప్రదేశ్ రాజధాని అయిన హైదరాబాదులో దౌర్జన్యంగా పేదవాళ్ల భూములను లాక్కుంటే వాళ్ళకు అండగా నిలిచి పేదలకు ఆవాసాలు ఏర్పరిచి అండదండలు అందించిన మొదటి వ్యక్తి కాక వెంకటస్వామి. సిడబ్ల్యూఎస్ మెంబర్గా కేంద్ర మంత్రిగా ఎన్నో పదవులు అధిరోహించిన దళిత నాయకుడు కాక. సింగరేణి నష్టాలలో కూరుకపోతే కేంద్ర ప్రభుత్వము తోటి మాట్లాడి లాభాల బాటలు నడిపించిన ఘనత కాకకే దక్కుతుంది. అందుకే సింగరేణి ఆయనను ఒక గొప్ప వ్యక్తిగా గుండెల్లో పెట్టుకొని కార్మికులు కొలిచినారు. కార్మికులకు పెన్షన్ సౌకర్యము కల్పించిన వ్యక్తి కూడా కాకనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను చూసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయాడు ఇప్పటికైనా దేశ రాష్ట్ర ప్రభుత్వాలు.. కాంగ్రెస్ వాదులు ఆలోచన చేసి కాక జయంతిని, వర్ధంతిని అధికారికంగా ప్రభుత్వమే నిర్వహించాలని ప్రజలు ప్రభుత్వాలను కోరుతున్నారు.

# రేషన్ డీలర్లను పెంచి పోషిస్తున్న రైస్ మిల్లర్లు

## దర్జాగా రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందా



**సుజాతనగర్ (ప్రశ్న న్యూస్)** సామాన్యులకు అందాల్సిన రేషన్ బియ్యం అక్రమ మార్గంలో పక్కదారి పడుతుంది. రేషన్ డీలర్లు, మిల్లర్లు కుమ్మక్కై సాగిస్తున్న ఒక పెద్ద రీసైక్లింగ్ దందా వల్ల ప్రభుత్వధనం దుర్వినియోగం అవడమే కాక, పేద లబ్దిదారులకు దక్కాల్సిన సాయం దళారుల జేబుల్లోకి వెళ్తోంది. ప్రభుత్వం అత్యంత తక్కువ ధరకే పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం కేవలం లబ్దిదారుల ఇళ్లకే పరిమితం కావడం లేదు. ఒక వ్యవస్థీకృతమైన అక్రమ మార్గంలో ఈ బియ్యం తిరిగి సివిల్ సప్లై గోడౌన్లకే చేరుతుందనే ఆరోపణలు ఉన్నాయి. దీని వెనుక రేషన్ డీలర్లు, బియ్యం మిల్లర్లు ఉన్నట్లు స్పష్టమవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలోని రైస్ మిల్లర్ ఒకరు రేషన్ డీలర్లు నుండి బియ్యాన్ని కొనుగోలు చేసి మళ్ళీ వాటినే ప్రభుత్వానికి అమ్మకం సాగిస్తున్నాడు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దందా నడిచే విధానం ఈ అక్రమ దందా ప్రధానంగా మూడు దశల్లో జరుగుతోంది.

### "డీలర్ల కొనుగోలు"

రేషన్ బియ్యం తీసుకున్న లబ్దిదారుల నుంచి రేషన్ డీలర్లు కిలోకు దాదాపు రూ. 10 చొప్పున వెనువెంటనే బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఆర్థిక అవసరాల దృష్ట్యా, కొంతమంది లబ్దిదారులు డీలర్లు చెప్పిన ధరకే బియ్యాన్ని విక్రయిస్తున్నారు.

### "మిల్లర్లకు విక్రయం"

ఈ విధంగా సేకరించిన వేల క్వింటాళ్ల బియ్యాన్ని రేషన్ డీలర్లు నేరుగా బడా బియ్యం మిల్లర్లకు తరలిస్తున్నారు. ఇక్కడ కిలో బియ్యాన్ని రూ. 18 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారం రాత్రికి రాత్రే రహస్యంగా పూర్తవుతోంది.

### "గోడౌన్లకు తిరిగి సరఫరా"

మిల్లర్లు ఈ బియ్యాన్ని తమ ప్రాసెసింగ్ యూనిట్లలో రీసైక్లింగ్ (పాలిషింగ్, ప్యాకేజింగ్) చేసి, మళ్ళీ కొత్త బియ్యంలాగా ప్రభుత్వ సివిల్ సప్లై గోడౌన్లకే సరఫరా చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి బియ్యం సరఫరా అయినట్టు రికార్డుల్లో చూపిస్తూ, ఈ మిల్లర్ అదనపు లాభాలను ఆర్జిస్తున్నాడు.

### ప్రభుత్వ ధనం... దళారుల పాలు

ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే బియ్యంపై కోట్లాది రూపాయల సబ్సిడీని భరిస్తోంది. ఈ రీసైక్లింగ్ దందా వల్ల, బియ్యం వాస్తవ లబ్దిదారులకు చేరకపోగా, అదే బియ్యాన్ని



ప్రభుత్వం రెండుసార్లు కొనుగోలు చేసినట్లవుతోంది. ఈ క్రమంలో రైస్ మిల్లర్ లాభాన్ని పొందుతున్నారు. ఈ భారీ అక్రమ లాభం కోట్లాది రూపాయల్లో ఉంది. ఈ అక్రమాలలో కొంతమంది రాజకీయ నాయకుల అధికారుల హస్తం ఉందన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా సివిల్ సప్లై అధికారులు ఇందులో కీలకపాత్ర పోషిస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ వ్యవహారం జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ మహా దందాపై సివిల్ సప్లై అధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రేషన్ డీలర్ల వద్దకు బియ్యం తిరిగి వస్తున్న మార్గాలు, మిల్లర్ల కొనుగోళ్లపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలి. పేదల కోసం ఉద్దేశించిన సాయం వారి దరి చేరేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఈ రీసైక్లింగ్ దందా మరిన్ని వేల కోట్ల ప్రజాధనాన్ని మింగేయడం ఖాయం.

# ఆలయంలోకి రావద్దు

## -దళితులపై వివక్ష

**-ఆలయంలోకి రాకుండా అడ్డగింత**

**-గుడికి తాళం**

**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)** ఈ ఆధునిక కాలంలోనూ కొన్ని చోట్ల దళితుల పట్ల వివక్ష వంటి సామాజిక దురాచారాలు కొనసాగుతున్నాయి. అంటరానితం వంటి దురాచారాలను ఎప్పుడో రూపుమాపారు. అయితే ఇప్పటికీ కొన్ని చోట్ల దళితులకు ఆలయాల్లోకి అనుమతించకుండా కొందరు అడ్డుకోవడం, అందరిలాంటి మనుషులమేనని, దేవుడిని దర్శించుకొని కోరిక తమకి ఉంటుందని వారు మొర పెట్టుకున్నా వినడం లేదు. దేశం అభివృద్ధిలో ముందుకు సాగుతున్నా తరాల నుంచి పాతుకుపోయిన అంటరానితనం రోగం వదలడంలేదు. ఇప్పటికీ కొన్ని చోట్ల దళితుల ఆలయ ప్రవేశాలను అడ్డుకుంటున్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఉల్లంఘిస్తూ వివక్ష చూపిస్తున్నారు.దొరవారిసత్రం మండలం పాళెం పాడు గ్రామంలోని కోరిందమ్మ గ్రామదేవతకి ఆదివారం గ్రామంలోని దళితులు పొంగళ్లు పెట్టేందుకు ఆలయానికి వెళ్లారు. ఆ ఆలయ పూజారి దళితులకు గుడిలోకి ప్రవేశం లేదని ఆలయానికి తాళం వేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దళితులు ఆలయం ముందు నిరసన చేశారు.దొరవారిసత్రం మండలం పాలేం పాడు గ్రామానికి చెందిన దళితులను కోరిందమ్మ ఆలయంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నారు.ఆధునిక యుగంలోనూ అంటరానితనం ఏదో ఒక రూపంలో కనిపిస్తుంది. కొన్ని గ్రామాలలో దళితులపై వేధింపులు నేటికి కొనసాగుతున్నాయి. సూళ్లూరుపేట తీర ప్రాంతాలలో ఉన్న 3 పంచాయితీలుదామరాయి పంచాయితీ లో ఉన్న కొల్ల పట్టు గ్రామంలో వెలసి ఉన్న అక్కాలమ్మ ఆలయంలో దళితులకు ప్రవేశం లేదు. కడపత్ర పంచాయతీలో ఉన్న యల్లమ్మ, ఆలయం. పత్రంగమ్మ ఆలయం లోకి దళితులకు ప్రవేశం లేదు. కొరిడి పంచాయితీలో ఉన్న యల్లమ్మ ఆలయం, ఇందులో కూడ దళితులకు ప్రవేశం లేదు పొంగళ్ళు పెట్టుకునే సమయంలో దళితులు ఆలయం భయట వరకే పరిమితం కావడం విశేషంఈ మూడు పంచాయితీలలో ఉన్నది దళితులు, బిసిలు, యలమ కాపులు , మాత్రమేవీరికే ఇంత వివక్ష ఉందో చూడండి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం దేశంలో అంటరానితనం నిషేధం. అంటరానితనాన్ని





పాటించడం తీవ్ర స్థాయి నేరం. ఎవరు ఎక్కడ, ఎప్పుడు ఏ విధంగా అంటరానితనాన్ని పాటించినా కఠిన శిక్షకు అర్హులు. ఈ అంశాలను రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించింది. వీటికి సంబంధించి అనేక చట్టాలు అమల్లో వున్నాయి. అయినప్పటికీ భారతీయ సమాజంలో అంటరానితనం అక్కడక్కడా అప్పుడప్పుడూ ఏదో ఒక రూపంలో బయటపడతూనే ఉంది. దేశంలో అత్యంత ప్రగతిశీలక రాష్ట్రాలుగా గుర్తింపు పొందిన చోట కూడా ఎస్సీలు, ఎస్టీలు, వెనుకబడిన తరగతులు, ఇతర దళిత వర్గాల పట్ల అంటరానితనంతో పాటు అనేక రకాలైన వివక్షలు కనిపిస్తూనే ఉన్నాయి. మన రాష్ట్రంలో ఆధిపత్య కులాలుగా ఉన్న బిసి లు కూడా దళితులపై కులవివక్ష చూపడం బాధాకరం. దళితులపై కులవివక్ష చెప్పిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు.

## బుగ్గారం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై క్రిమినల్ కేసుల నమోదు

**- లోకాయుక్త జస్టిస్ ఉత్తర్వులు**

**-లోకాయుక్త ఆర్డర్ ను అమలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాలు**

**- అదనపు కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారికి ఉత్తర్వులు జారీ**

**-లోకాయుక్త ఆర్డర్ ను దిక్కరించిన బుగ్గరం పంచాయతీ అధికారులు**

**-సోమవారం లోకాయుక్త ఆప్ తెలంగాణలో తీర్పు ధిక్కారంపై విచారణ**




**జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్)** బుగ్గారం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై 2024 డిసెంబర్ 6న జారీ చేసిన లోకాయుక్త జస్టిస్ ఆర్డర్ ను జగిత్యాల జిల్లా బుగ్గారం పంచాయతీ అధికారులు ధిక్కరించారని పిర్యాదుదారుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 సోమవారం తీర్పు దిక్కరణ పిర్యాదుపై లోకాయుక్త ఆప్ తెలంగాణ లో విచారణ జరగనుందని విలేఖరుల సమావేశంలో తెలిపారు. లోకాయుక్త ఆర్డర్ ను అమలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ 2025 జనవరి 6న జిల్లా పంచాయతీ అధికారికి ఉత్తర్వులు జారీ చేసారని బుగ్గారం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆ ఉత్తర్వులలో ఆదేశించారని అన్నారు. లోకాయుక్త జస్టిస్ ఇచ్చిన ఆర్డర్ (తీర్పు) ను అధికారులు ధిక్కరించి అమలు చేయడం లేదని ఆరోపించారు. అట్టి పిర్యాదుపై ఈ నెల 6న సోమవారం ఉదయం 11 గం.లకు విచారణ కలదని, ఇట్టి విచారణకు తనను హాజరు కావాలని లోకాయుక్త నుండి నోటీసులు అందినట్లు పిర్యాదుదారుడు తెలిపారు.

## హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్‌పై ప్రమాదం

**- వరుసగా ఢీకొన్న ఆరు కార్లు**



**హైదరాబాద్** నగరంలోని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పై శనివారం మధ్యాహ్నం ఓ భారీ ప్రమాదం చోటుచేసుకుంది. ఒకదాని వెనుక ఒకటి మొత్తం ఆరు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అయితే, ఈ ప్రమాదం కారణంగా ఓఆర్ఆర్‌పై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. వివరాల్లోకి వెళితే, శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళుతున్న మార్గంలో, హిమాయత్ సాగర్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న ఒక కారు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో, దాని వెనుక వస్తున్న వాహనాలు వేగాన్ని అదుపు చేసుకోలేకపోయాయి. దీంతో ఒకదానికొకటి వేగంగా ఢీకొట్టుకున్నాయి. ఈ విధంగా మొత్తం ఆరు కార్లు ఈ ప్రమాదంలో చిక్కుకున్నాయి. ప్రమాద తీవ్రతకు కార్లలోని ఎయిర్‌బ్యాగ్‌లు వెంటనే తెరుచుకోవడంతో ప్రయాణికులందరూ ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో ఓఆర్ఆర్‌పై భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు, ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ల సహాయంతో పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. అధిక వేగం, ముందు వెళ్తున్న వాహనానికి తగినంత దూరం పాటించకపోవడం వంటివే ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## చైల్డ్ కేర్ సెంటర్‌లో శిశువు మరణంపై సీరియస్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ సంరక్షణ కేంద్రాల్లో చోటుచేసుకున్న రెండు వేర్వేరు తీవ్రమైన ఘటనలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. అనంతపురంలోని ప్రభుత్వ శిశుగృహంలో ఏడాదిన్నర బాలుడు మృతి చెందడం, పార్వతీపురం మన్యం జిల్లాలోని గురుకుల పాఠశాలలో 85 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవ్వడంపై ఆయన ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి జి. సంధ్యారాణితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతపురం శిశుగృహంలో జరిగిన బాలుడి మృతి ఘటన తీవ్ర కలకలం రేపింది. సిబ్బంది మధ్య ఉన్న వివాదాల కారణంగానే పసికందుకు సరిగా ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహించారని, అదే చిన్నారి మృతికి దారితీసిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని హడావుడిగా ఖననం చేశారన్న విమర్శలు కూడా వెల్లువెత్తాయి. కళ్యాణదుర్గానికి చెందిన ఓ మహిళ ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన బిడ్డను సెప్టెంబర్ 30న శిశుగృహంలో చేర్పించారు. పుట్టుకతోనే తక్కువ బరువుతో ఉన్న ఆ చిన్నారి, దసరా రోజు (అక్టోబర్ 2న) విరేచనాలతో మృతి చెందాడు. అనంతపురం ఘటనపై జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ విచారణకు ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఈబీ దేవి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. నాగమణి, ప్రభుత్వ ఆసుపత్రి పీడియాట్రిక్ హెచ్ఓడీలతో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సమగ్ర నివేదిక సమర్పించాక బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. శిశుగృహం మేనేజర్‌తో పాటు ఆయాలకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి మెమోలు జారీ చేశారు.

# ప్రజలలో అవగాహన రావాలి



**- చెత్తను రోడ్లపై వేయడం మానాలి**

**- చెత్త సేకరణ ఆటోలు ఉన్న డబ్బుల కోసం చెత్త వెయ్యని స్థానికులు**

**- ఇండస్ట్రియల్ ప్రాంతంలో చెత్త వేస్తున్న కాలనీవాసులు**

**- ఇండస్ట్రియల్ అధికారుల నిర్లక్ష్యంతో కుప్పలు తెప్పలుగా చెప్పేదిబ్బలు**

**- నిషేధ ప్రాంతాలలో చెత్త వేసేవారికి ఫైన్ వేయండి అంటున్న స్థానికులు**

**నాచారం (ప్రశ్న న్యూస్)** నాచారం డివిజన్ పరిధిలోని రవీంద్ర నగర్ పక్కన ఉన్న ఐ డి ఏ లో చెత్త తొలగింపు పై ఇండస్ట్రియల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనాదారులు, వాదాచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఉన్న చెత్తకుప్పలో పరిశ్రమల కంటే పక్కనే ఉన్న కాలనీ వాసులు చెత్తని వేస్తున్నారని చెత్త సేకరణ ఆటోలు ఉన్న వాటిని ఉపయోగించుకోకుండా ఇలా రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడంతో ఇబ్బందిగా మారుతుందని దుర్వాసన వ్యాపించడంతోపాటు వర్షాకాలం ఉండడం వల్ల రోగాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కాలనీలలో చెత్త సేకరించే ఆటోలు ఉన్న కొంతమంది తమ పిసనారితనంతో వాళ్లకు డబ్బులు చెల్లించడం ఎందుకు అనుకొని వాటిని వినియోగించుకోకుండా ఇలా రోడ్ల పైన చెత్త వేసి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఇక మరికొంతమంది సమయానికి చెత్త సేకరించె ఆటోలకు ఇవ్వకపోవడంతో తర్వాత ప్లాస్టిక్ కవర్లలో పెట్టి ఇలా ఎక్కడపడితే అక్కడ పడవేయడంతో నాచారం డివిజన్లో చెత్త దర్శనమిస్తుందని ప్రజలు ఇలా రోడ్ల పైన వేయకుండా అవగాహన తీసుకొచ్చుకొని నలుగురికి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని ఎన్నిసార్లు అవగాహన కల్పించిన ఇలా చేయడంతో వారి చుట్టుపక్కల ఉన్న పరిసర ప్రాంతాలే అద్వాన్నంగా మారుతున్నాయని దుర్వాసనతో నిండిపోతాయని దానితోపాటు రోగాలు కూడా వస్తాయని పలువురు సూచిస్తున్నారు. దీనితోపాటు ఇటు కాలనీకి అటు ఐడిఏకు మధ్యలో ఉన్న ఈ చెత్తకుప్పలో కాలనీవాసులు చెత్త వేస్తున్నారు కాబట్టి జిహెచ్ఎంసి అధికారులే ప్రతిరోజు చెత్తను సేకరిస్తే బాగుంటుందని స్థానికులు సూచిస్తున్నారు. ప్రాంతం ఐడిఏ పరిధిలో ఉన్న చెత్త వేసేది కాలనీవాసులు కాబట్టి జిహెచ్ఎంసి అధికారులు ప్రతిరోజు చెత్తను తొలగించాలని లేకుంటే ఒక శానిటేషన్ సిబ్బందిని కొన్ని రోజులపాటు అక్కడ ఏర్పాటు చేసి చెత్త వేయకుండా పర్యవేక్షించాలని స్థానికులు సూచిస్తున్నారు.

### ఇక్కడ చెత్త వేస్తే ఫైన్ వేయండి..

కాలనీవాసులకు ఇక్కడ చెత్త వేయవద్దని ఎన్నిసార్లు అవగాహన కల్పించిన కావాలని వేస్తున్నారు. కాబట్టి మున్సిపల్ అధికారులు శానిటేషన్ సిబ్బందిని ఇక్కడ కొన్ని రోజులపాటు పర్యవేక్షణలో ఉంచి ఎవరైనా చెప్పే వేస్తే భారీగా ఫైన్ వేయాలని అప్పుడు కానీ కొంతమందిలో మార్పు రాదని స్థానికులు సూచిస్తున్నారు. ఇలా ఫైన్ వేయడం వల్ల చెత్తను రోజు ఆటోలో వేస్తారని సూచిస్తున్నారు. మరి దీనిపై అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు ఎలా స్పందిస్తారో వేచి చూద్దాం.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588